


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 185, పేజీలు - 08

బుధవారం, డిసెంబర్ 17, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## విద్యారంగం సమగ్రాభివృద్ధికి సహకరించండి

### - నిర్మలా సీతారామన్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు సహకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో పార్లమెంట్‌లోని ఆమె ఛాంబర్‌లో సమావేశమయ్యారు.తెలంగాణ వ్యాప్తంగా 105 శాసనసభ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ప్రాధాన్యతను వివరించారు. విద్యా రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు.



**వైఐఐఆర్ఎస్ కోసం రూ.21 వేల కోట్లు వ్యయం**

తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్రఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించారు. 5 నుంచి 12 తరగతుల వరకు ఉండే ఒక్కో వైఐఐఆర్ఎస్ లో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, మొత్తంగా 105 పాఠశాలతో 2.70 లక్షల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని చెప్పారు. వైఐఐఆర్ఎస్ లు సమీప ప్రభుత్వ

2లో..

## సోనియా గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

### - 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ సమర్పణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆమెకు అందజేసి, రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి సోనియా గాంధీకి సీఎం

2లో..

## మోదీకి ఆ రెండు అంశాలు అసలే గిట్టవు

### గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై రాహుల్ ఆగ్రహం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పేరు మార్పుపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రెండు అంశాలు అసలే గిట్టవని ఆయన అన్నారు. ఒకటి రాహుల్ గాంధీ ఆలోచనలు, రెండోది పేదల హక్కులంటే ఆయనకు ఇష్టం ఉండదని విమర్శించారు. గాంధీజీ గ్రామ స్వరాజ్యం ఆలోచనలకు ప్రతిరూపమే గ్రామీణ ఉపాధి హామీ పథకమని, అలాంటి పేరు మార్పు సముచితం కాదని అభిప్రాయపడ్డారు. ఈ పథకం పేరు

2లో..

## ఏపీలో త్వరలో డిజిటిల్ హెల్త్ రికార్డులు

### - వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలను అవలంబిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు నిపుణుల సలహాలను తీసుకోవాలని సీఎం సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షించారు. ఈ మేరకు గేట్స్ ఫౌండేషన్ తో కలిసి వైద్యారోగ్య రంగంలో ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని సహా వివిధ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. యూఎన్‌ఎయిడ్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఏఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్తి అహుజా, సైటెస్ ఛైర్ పర్సన్ రిజ్వాన్ కొయిటా, కోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నాదముని, గేట్స్ ఫౌండేషన్ జినోమిక్స్ అండ్ ఎపిడామిలజీ డైరెక్టర్ డాక్టర్ గగన్

2లో..



## లీక్ వీరులకు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

### మోదీ మీటింగ్‌పై కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీలో లీకుల వ్యవహారంపై కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ బీజేపీ ఎంపీలతో జరిపిన అంతర్గత సమావేశ వివరాలు మీడియాకు లీక్ కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని ఎంపీలకు క్లాస్ తీసుకున్నారంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, అది కేవలం తప్పుడు ప్రచారం మాత్రమేనని కొట్టిపారేశారు. గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ఎంపీలతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర పార్టీ పనితీరుపై ప్రధాని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని, ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్

2లో..

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార గర్వం పెరిగిపోయింది

### - బెదిరింపులపై కేటీఆర్ ఆగ్రహం

- ప్రభుత్వ నిధులు, ఇందిరమ్మ ఇళ్లు నేతల సొంత ఆస్తి కాదని స్పష్టీకరణ
- యూరియా కొరతను కప్పిపుచ్చుకునేందుకే కొత్త యాప్ డ్రామా
- బీసీ రిజర్వేషన్లు తగ్గించి రేవంత్ రెడ్డి మోసం చేశారని విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార మదం తలకెక్కిందని, ప్రజలను , ప్రజాప్రతినిధులను చంపేస్తామంటూ బరితెగించి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం

2లో..

## థాయ్-కంబోడియా సరిహద్దు వివాదం

### - తీవ్రమవుతున్న ఘర్షణలు, థాయ్‌లాండ్ కీలక డిమాండ్




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఆగ్నేయాసియా దేశాలైన థాయ్‌లాండ్, కంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణలు

2లో..

## ఐడీపీఎల్ భూములపై విచారణకు ఆదేశం

- కవిత భర్త అనిల్‌పై మాధవరం కృష్ణారావు భూకబ్జా ఆరోపణలు
- పరస్పరం ఆరోపణలు చేసుకున్న కవిత, ఎమ్మెల్యే
- వివాదం సంచలనంగా మారడంతో విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలోని కూకట్‌పల్లిలోని సర్వే నంబర్ 376లో ఉన్న, రూ. 4 వేల కోట్ల విలువైన ఐడీపీఎల్ భూములపై తెలంగాణ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ భూముల కబ్జా విషయంలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తెలంగాణ జాగృతి

2లో..




## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

### - జీవనకాల కనిష్ఠానికి రూపాయి

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, దేశీయంగా మెటల్, రియల్టీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే

2లో..



## ఆస్ట్రేలియా టెర్రరిస్ట్ సాజిద్ హైదరాబాద్ వాసి

### - డీజీపీ సంచలన ప్రకటన



**హైదరాబాద్** ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఉన్న ప్రసిద్ధ బోండీ బీచ్ వద్ద జరిగిన ఘోర ఉగ్రదాడి ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ దాడికి పాల్పడిన వారిలో ఒకరు హైదరాబాద్‌కు చెందిన సాజిద్ అక్రమ్ అని తేలడంతో రాష్ట్ర పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఉగ్రదాడిలో ఇప్పటివరకు 16 మంది మరణించగా, 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి నిందితుడి పూర్తి వివరాలను వెల్లడించారు.

2లో..

## విజయవాడలో కూల్చివేతలపై సీబీఐ విచారణ జరిపించాలి

### - రూ.150 కోట్ల భూమి కోసమే పేదల ఇళ్లను కూల్చారని ఆరోపణ

అమరావతి (ప్రశ్న న్యూస్) విజయవాడ నగరంలోని జోజి నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేశారంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కూల్చివేతలకు గురైన బాధితులను పరామర్శించి, వారికి సంఘీభావం తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా, డిసెంబర్ 31 వరకు బాధితులకు ఊరట లభించినప్పటికీ, భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇళ్లను

2లో..



## యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో చంద్రబాబు భేటీ

### - వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణల వంటి అంశాలపై సంప్రదింపులు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్, అమెరికా మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఇరువురి మధ్య పరస్పర ఆసక్తి ఉన్న పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.

2లో..



# ఏపీలో త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

దీప్ కాంగ్, పబ్లిక్ హెల్త్ నిపుణురాలు మార్గరెట్ ఎలిజిబెత్, ఢిల్లీ ఎయిమ్స్ ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ టాండన్ అత్యుతన్నతస్థాయి నిపుణుల సలహా బృందంలో ఉన్నారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందం సభ్యులు వర్చువల్ గా ఈ సమీక్షకు హాజరయ్యారు.

## డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నాం

'వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు నిర్దేశించిన అంశాలను అమలు చేస్తున్నాం. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం,చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశాం. రియల్ టైమ్ లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుంది. వివిధ అంశాల్లో ప్రజలకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుంది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తాం'అని సీఎం చంద్రబాబు నాయు చెప్పారు.

## వైద్యారోగ్య రంగంలో టెక్నాలజీ వినియోగం

'2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా మేం ప్రయత్నాలు చేస్తున్నాం. ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉంది. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.'వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున పెరగాలి. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నాం. వ్యాధుల బారిన పడి ఆ తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ విధానాలపై దృష్టి పెట్టాలి. ఇలా చేయగలిగితే ప్రజల వైద్య ఖర్చులు చాలా వరకు తగ్గుతాయి. దీని ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుంది, ఆర్థిక వెసులుబాటూ కలుగుతుంది. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి నిపుణుల బృందం సలహాలు ఇవ్వాలని కోరుతున్నాం. ముంబైలో త్వరలో గ్లోబల్ ఏఐ కన్వెన్షన్ జరగబోతోంది, ఆ కన్వెన్షనులో వైద్యారోగ్యంలో టెక్నాలజీ వినియోగంపై ఏపీ ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలను ప్రదర్శించాలని ఆలోచన చేస్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని నిపుణుల బృందాన్ని కోరుతున్నా. ప్రజల ఆరోగ్య డేటాను విశ్లేషించి ముందస్తుగానే తగిన నియంత్రణా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. విధానాల రూపకల్పన ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదు. అది క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు అయినపుడే అది విజయ వంతం అవుతుంది'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ఏడాదిలోగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తాం. స్క్రీనింగ్ లో టాప్ 10లో ఉన్న రోగాలను గుర్తించి విశ్లేషించేందుకు ప్రయత్నిస్తాం. ఇటీవల గిరిజన ప్రాంతాల విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతను నేర్పేలా ఓ చిన్న కార్యక్రమం చేపట్టాం. వివిధ అంశాలకు ఆంధ్రప్రదేశ్ ఓ స్టార్టప్ ఏరియాగా ఉంటుంది. హెల్తీ,వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది. నిపుణుల బృందం విలువైన సలహాలను ఏపీలో అమలు చేస్తాం'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

## ప్రజారోగ్య సంరక్షణకు నిపుణుల బృందం సూచనలు

వైద్యారోగ్య రంగంలో నర్సులు, వైద్యులు అందుబాటులో ఉండడం ఎంత అవసరమో పౌష్టిక ఆహారం అనేది ముఖ్యమని ప్రపంచ ఆరోగ్యసంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్ అన్నారు. వాయు, జల, భూ కాలుష్యాల ద్వారా ప్రజారోగ్యం ఇబ్బందుల్లో పడుతోందని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా ప్రజల్ని చైతన్యం చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని కేవలం మెడికల్ అంశంగానే చూడకూడదని యూఎన్ఎయిడ్స్ డైరెక్టర్ పీటర్ పాయిట్ స్పష్టం చేశారు. ఇతర అంశాలు కూడా ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. రూట్ కాజ్ అనాలసిస్ చేస్తే ముందుగానే రోగాల బారిన పడకుండా నియంత్రణా చర్యలు చేపట్టవచ్చని విశ్రాంత ఐఏఎస్ ఆర్తీ అహుజా అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా యువతలో డయాలసిస్ పేషెంట్లు పెరుగుతున్నారని దీనికి కాలుష్యమే ప్రధాన కారణమని అన్నారు. ఏఐ, డిజిటల్ హెల్త్ ద్వారా వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయని సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ వైవై టియో చెప్పారు. ఈ మేరకు ప్రాధాన్యతలను విశ్లేషించుకుని ప్రజారోగ్యంలో సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. హెపటైటిస్ టీకాను సమర్థంగా వినియోగించుకున్న రాష్ట్రంగా ఏపీ ఉందని మార్గరెట్ ఎలిజబెత్ వెల్లడించారు. హెల్త్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజారోగ్యంపై మెరుగైన విధానాల్ని తీసుకువచ్చే అవకాశం ఉంటుందని సూచించారు. డిజిటల్, ఏఐ ఎనేబుల్డ్ సేవలు వైద్యారోగ్యంలో ఇప్పుడు ముఖ్యమైన అంశాలుగా మారాయని శ్రీకాంత్ నాదముని అన్నారు. ఏఐ డాక్టర్ ద్వారా ప్రాథమికంగా రోగి సందేహాలు తొలగించవచ్చని చెప్పారు. సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ కేర్ కేంద్రంగా ఏపీ తయారవుతోందని డాక్టర్ రిజ్వాన్ వెల్లడించారు. వైద్య విద్యార్థులు, నర్సుల లాంటి వారికి డిజిటల్ హెల్త్ కేర్ లో శిక్షణ అందించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ, రిస్క్ ఫ్యాక్టర్ ఎంత ఉందన్నది ప్రాథమికంగా గుర్తించాల్సి ఉంటుందని డాక్టర్ నిఖిల్ టాండన్ చెప్పారు. అన్ని వ్యాధులకు ఒకే రకమైన విధానాలను అనుసరించలేమని, ఈ మేరకు క్లినికల్ మేనేజ్మెంట్ అసెస్మెంట్ ద్వారా వేర్వేరు రకాలుగా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేషన్ నుంచే హెల్త్ కేర్ సాధ్యం అవుతుందని డాక్టర్ నాగేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫిట్ నెస్, హైజీన్ లాంటివి విద్యార్థుల దశ నుంచే ఈ తరహా హెల్త్ ఎడ్యుకేషన్ ను అమలు చేయాల్సి ఉంటుందని సూచించారు.

## ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ ముందుకు

రాష్ట్రంలో గ్లోబల్ స్థాయి ప్రమాణాలతో వైద్యారోగ్య నిపుణులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ పనిచేస్తోందని ఆ సంస్థ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ అన్నారు. ప్రజారోగ్య పర్యవేక్షణ కోసం ఓ హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందింస్తామని ఆమె స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనలని నిపుణుల బృందం చేసిందని వారి సిఫార్సులు హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఉపకరిస్తాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని ఏపీలో అమలు చేస్తామని సత్యకుమార్ యాదవ్ అన్నారు. సీఎం చంద్రబాబు తరచూ ప్రజారోగ్యం రంగాన్ని ఎలా పటిష్ట పరచాలన్న అంశాలపైనే ఆలోచన చేస్తారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. ఇకపై ఏడాదిలో రెండుసార్లు నిపుణుల బృందంతో భేటీ అవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.నిపుణులు ఇచ్చిన సలహాలను సూచనలను క్రోడీకరించి యాక్షన్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పగించారు.

# ఐడీపీఎల్ భూములపై విచారణకు ఆదేశం

అధ్యక్షురాలు కవిత పరస్పరం ఆరోపణలు చేసుకోవడం తెలిసిందే. మాధవరం కృష్ణారావు భూములు కబ్జా చేశారని, ఎన్నో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారని జాగృతి జనం భాటలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో దీనిపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం విలువైన ఐడీపీఎల్ భూముల కబ్జా ఆరోపణలపై సమగ్ర విచారణకు నిర్ణయం తీసుకుంది. కూకట్‌పల్లిలోని రూ. 4 వేల కోట్ల విలువైన ఐడీపీఎల్ భూములపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

## ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే

ప్రభుత్వం నిర్ణయంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. తాను సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని ఐడీపీఎల్ భూములపై విచారణ జరిపించాలని కోరారని ట్విస్ట్ ఇచ్చారు. అన్ని ఆధారాలు ప్రభుత్వానికి ఇచ్చానని, తన కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తానన్నారు. ప్రభుత్వ విచారణలోనైనా ఐడీపీఎల్ భూములపై అక్రమాలు, కబ్జాలు చేసింది ఎవరో తేలుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు.

## ఐడీపీఎల్ భూములు, వాటి నేపథ్యం

ఐడీపీఎల్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఒక పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (పీఎస్యూ). ఇది గతంలో దేశంలో ఔషధాల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించడం తెలిసిందే. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న ఈ సంస్థకు చెందిన భూములు దశాబ్దాలుగా అనేక వివాదాలకు, కబ్జా ఆరోపణలకు కేంద్రంగా మారాయి. ఈ భూములు మార్కెట్ విలువ పరంగా చాలా విలువైనవిగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ కావడం, కాలక్రమేణా సంస్థ మూతపడటం లేదా బలహీనపడటం వల్ల ఈ ఖాళీ భూములపై కన్నేసి కొందరు కబ్జాలు చేశారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలోనూ ఈ భూముల విషయంపై ఆరోపణలు వచ్చాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఐడీపీఎల్ భూములపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయడంతో ఈ భూముల వాస్తవ పరిస్థితి, కబ్జాలు, అందులో ప్రమేయం ఉన్నవారి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# థాయ్-కంబోడియా సరిహద్దు వివాదం

కొనసాగుతున్న వేళ, థాయ్‌లాండ్ ఓ కీలక షరతు విధించింది. తమ భూభాగంపై దాడికి పాల్పడింది కంబోడియానే కాబట్టి, కాల్పుల విరమణను కూడా ఆ దేశమే ముందుగా ప్రకటించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు థాయ్‌లాండ్ విదేశాంగ శాఖ ప్రతినిధి మరాటీ నలితా అండమో మంగళవారం బ్యాంకాక్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. "థాయ్‌లాండ్ భూభాగంపై కంబోడియా దురాక్రమణకు పాల్పడింది. కాబట్టి, కాల్పుల విరమణ ఒప్పందాన్ని వారే ముందుగా ప్రకటించాలి" అని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, సరిహద్దు ప్రాంతాల్లోని ల్యాండ్‌మైన్‌లను తొలగించేందుకు కంబోడియా చిత్తశుద్ధితో సహకరించాలని కూడా డిమాండ్ చేశారు. అయితే, థాయ్‌లాండ్ చేసిన ఈ ప్రకటనపై కంబోడియా నుంచి తక్షణమే ఎలాంటి స్పందన రాలేదు. ఇరు దేశాల మధ్య 817 కిలోమీటర్ల సరిహద్దుపై చాలాకాలంగా వివాదాలున్నాయి. ఈ క్రమంలో డిసెంబర్ 7న జరిగిన ఓ ఘర్షణతో మరోసారి దాడులు మొదలయ్యాయి. ఈ తాజా ఘర్షణల్లో ఇరువైపులా సైనికులు, పౌరులతో కలిపి ఇప్పటివరకు 32 మంది మరణించారు. సుమారు 8 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారంటూ ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో జులైలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైంది. గత శనివారం నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ట్రంప్ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారలేదు. సరిహద్దుల్లో ఇంకా పోరు కొనసాగుతూనే ఉంది.

# ఆస్ట్రేలియా టెర్రరిస్ట్ సాజిద్ హైదరాబాద్ వాసి

50 ఏళ్ల సాజిద్ అక్రమ్ పక్కా హైదరాబాద్ నివాసి. ఇక్కడ అతనికి ఉన్న సంబంధాలను పోలీసులు లోతుగా విచారించారు. సాజిద్ హైదరాబాద్‌లోనే తన బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. 1998 నవంబర్‌లో పైచదువుల నిమిత్తం విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. సాజిద్ తండ్రి గతంలో రక్షణ రంగంలో పనిచేశారు. ఇతని సోదరుడు షాహిద్ ప్రస్తుతం పాతబస్తీలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఒక యూరోపియన్ యువతిని వివాహం చేసుకున్న సాజిద్‌కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని పిల్లలు ఆస్ట్రేలియా పౌరులే అయినప్పటికీ సాజిద్ మాత్రం ఇప్పటికీ భారత పాస్‌పోర్టునే వినియోగిస్తుండటం గమనార్హం.

## బోండీ బీచ్ దాడిలో ఏం జరిగింది.?

ఆదివారం యూదులు జరుపుకునే పవిత్రమైన హనుక్కా వేడుకల లక్ష్యంగా ఈ దాడి జరిగింది. బీచ్ కార్యక్రమంలో ఉన్న ప్రజలపై సాజిద్ , అతని కుమారుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసుల పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఆస్ట్రేలియా పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో సాజిద్ అక్రమ్ హతమవ్వగా అతని కుమారుడిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో సాజిద్‌పై ఎలాంటి నేరారోపణలు లేవు. ఆస్ట్రేలియా వెళ్ళాకే అతను ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు పెంచుకున్నట్లు తెలుస్తోంది.

## పోలీసుల విచారణలో మరిన్ని వాస్తవాలు..

తెలంగాణ పోలీసులు సాజిద్ గత 27 ఏళ్ల చరిత్రను తవ్వితీశారు. ఈ మూడు దశాబ్ద కాలంలో సాజిద్ కేవలం ఆరుసార్లు మాత్రమే ఇండియాకు వచ్చాడు. చివరిగా 2022లో హైదరాబాద్‌ను సందర్శించాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే తన తండ్రి మరణించిన సమయంలో కూడా అతను స్వదేశానికి రాలేదు. హైదరాబాద్‌లో ఉంటున్న అతని కుటుంబ సభ్యులు సాజిద్ ఉగ్రవాద చర్యల గురించి తమకేమీ తెలియదని పోలీసులకు తెలిపారు. చాలా కాలంగా అతనితో సంబంధాలు తక్కువగానే ఉన్నట్లు చెప్పారు. సాజిద్‌కు సంబంధించి మరిన్ని అంతర్జాతీయ సంబంధాల గురించి తెలంగాణ డీజీపీ కార్యాలయం ఆస్ట్రేలియా అధికారులతో సమన్వయం చేసుకుంటోంది.

# విజయవాడలో కూల్చివేతలపై సీబీఐ విచారణ జరిపించాలి

కూల్చివేయడం దారుణమని అన్నారు. ఈ సందర్భంగా జగన్ మీడియాతో మాట్లాడుతూ రూ.150 కోట్ల విలువైన 2.17 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకే ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలోనే నకిలీ పత్రాలు సృష్టించి, 2016లో బ్యాక్ డేట్‌తో ఒక బోగస్ సొసైటీని రిజిస్టర్ చేసి, ఉద్దేశపూర్వకంగా న్యాయపరమైన వివాదాన్ని సృష్టించారని విమర్శించారు. ఈ కూల్చివేతల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్, స్థానిక ఎంపీ, జనసేన కార్పొరేటర్ హస్తం ఉందని ఆయన ఆరోపించారు.గత 25 ఏళ్లుగా చట్టబద్ధంగా నివసిస్తున్న 42 కుటుంబాలకు చెందిన ఇళ్లను కూల్చివేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు అన్ని అనుమతులు పొంది, బ్యాంకు రుణాలకు ఈఎంఐలు కూడా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. అసలు ఆ భూమి వారిది కానప్పుడు ప్రభుత్వం ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు వివాదాస్పద భూములను గుర్తించి, వాటిపై కేసులు సృష్టించి, కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయసహాయం అందిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఈ అక్రమ కూల్చివేతలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలు, పెద్దల పాత్ర బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే మార్గమని జగన్ స్పష్టం చేశారు.

# యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో చంద్రబాబు భేటీ

ఈ సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాల బలోపేతం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. "యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ ను కలవడం ఆనందదాయకం. బలమైన వ్యాపార పర్యావరణ వ్యవస్థ, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన చైతన్యవంతమైన తెలుగు డయాస్పోరా కారణంగా భారత్-అమెరికా సంబంధాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా వ్యాపార సంస్థలకు, విద్యాసంస్థలకు ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ నమ్మకమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే భాగస్వామిగా కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశం ఇరుపక్షాల మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరోగ్య శిబిరం

**- పోషకాహారం - పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన**

**- బోయినిపల్లి మండల వైద్యాధికారి : డాక్టర్ కార్తీక్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య బృందం విద్యార్థినులను పరిశీలించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.ఈ సందర్భంగా బాలికలకు నోటి పరిశుభ్రత, చేతులు కడుక్కోవాల్సిన సరైన విధానం, చలికాలంలో ఎక్కువగా వచ్చే నిమోనియా, అస్తమా, అలర్జీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అనంతరం హాస్టల్‌ను పరిశీలించిన వైద్యులు, విద్యార్థినులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పరిశుభ్రంగా, వేడి వేడిగా అందించాలని వార్డెన్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్, సూపర్వైజర్లు టి. హేమలత, ఎస్.ఓ లింగవ్వ, సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్త ఉషాదేవి, స్కూల్ ఆరోగ్య కార్యకర్త ప్రసన్న, ఆశా కార్యకర్త లతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సోనియా గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

రేవంత్ రెడ్డి వివరించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. ఇటీవల డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' వివరాలను కూడా ఆమెకు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధిపై రేవంత్ రెడ్డి దార్శనికతను సోనియా గాంధీ అభినందించారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ, ముఖ్యమంత్రికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యారంగం సమగ్రాభివృద్ధికి సహకరించండి

పాఠశాలలకు విద్యా హబ్‌లుగా ఉండటంతో పరోక్షంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని తెలియజేశారు.అత్యాధునిక వసతులు, లేబొరేటరీలు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## విద్యారంగం సమగ్రాభివృద్ధికి రూ.30వేల కోట్లు

రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు వెచ్చించినున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటు చేయనున్నామని, తద్వారా సేకరించే రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి కేంద్రఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, తెలంగాణలో విద్యా రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూపుతున్న చొరవను ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ అభినందించారు. వైఐఐఆర్ఎస్ మోడల్ బాగుందన్న కేంద్ర మంత్రి ఎస్పీవీకి సంబంధించిన వివరాలను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు మందాడి అనిల్ కుమార్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ఉన్నారు.

## హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయండి

మరోవైపు హైదరాబాద్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఛాంబర్‌లో భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో, 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించిన విషయాన్ని తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కూడా చెప్పారు. అందుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

# మోదీకి ఆ రెండు అంశాలు అసలే గిట్టవు

మార్పు బిల్లు మహాత్మా గాంధీ ఆలోచనలకు అవమానమని ఆయన అభివర్ణించారు. 2014 నుంచి ఈ పథకాన్ని బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని మోదీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ఈ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు ఏకంగా ఆ పథకాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార గర్వం పెరిగిపోయింది

తెలంగాణ భవన్‌లో ఖానాపూర్, షాద్ నగర్ నియోజకవర్గాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులకు భయపడవద్దు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఒక ఎమ్మెల్యే అయితే గెలిచిన వారిని చంపేస్తానని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. సర్పంచులు ఎవరూ ఇలాంటి బెదిరింపులకు లొంగవద్దు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోవడానికి ఈ ఎమ్మెల్యేలు ఎవరు? అవి మీ అబ్బ సొత్తు కాదు, మీ అత్త సొత్తు కాదు. రేవంత్ రెడ్డి ఏమైనా తన భూములు అమ్మి గ్రామాలకు నిధులిస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజల పైసలతో కడుతున్న ఇళ్లకు అర్హులను ఎంపిక చేసే పూర్తి అధికారం గ్రామ సభలకు, సర్పంచులకే ఉంటుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే నిధులు దిక్కు లేక ప్రపంచబ్యాంకుకు ఉత్తరాలు రాస్తున్నారని, అలాంటి సర్పంచ్ లకు ఏం ఇస్తారని కెటిఅర్ ఏద్దేవా చేశారు. రెండు సంవత్సరాల్లో ఒక్క రూపాయికూడా గ్రామ పంచాయితీలకు ఇవ్వని కాంగ్రెస్ , ఇప్పుడు ఎలా గ్రామాలు నిధులు ఇస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు తమ ఇండ్లు భూములు అమ్మి నిధులివ్వడంలేదని, ప్రజల సొమ్ములకు ధర్మకర్తలు మాత్రమే అని గుర్తుంచుకోవాలని కెటిఅర్ హెచ్చరించారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి భిక్ష కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఐదు అంచెల పాలనలో గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి ఉందని గుర్తు చేశారు. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన రూ. 3,500 కోట్ల నిధుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసి, రిజర్వేషన్లను 24% నుంచి 17%కి తగ్గించి హడావుడిగా ఎన్నికలు జరిపింది. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో 70 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకే రావాలి. ఆ నిధులను ఆపే హక్కు ఏ ముఖ్యమంత్రికి గానీ, ఎమ్మెల్యేకు గానీ లేదన్నారు.

## మళ్ళీ వచ్చేది మన ప్రభుత్వమే

సర్పంచ్ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలు తిరుగుతూ ప్రచారం చేయడం చరిత్రలో ఎన్నడూ లేదని కేటీఆర్ విమర్శించారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్, కేసీఆర్ వంటి నాయకులు ఏనాడూ సర్పంచ్ ఎన్నికల కోసం రోడ్ల మీద పడలేదన్నారు. రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే విజయోత్సవాల పేరుతో పరోక్ష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేళ్లే. మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. మీరు ఐదేళ్ల కోసం గెలిచారు, మిగిలిన సగం కాలం మన ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు చేసుకుంటారు. ఖానాపూర్, షాద్ నగర్ గడ్డపై మళ్ళీ గులాబీ జెండా ఎగురడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎంపిటిసి, జడ్పీ ఎన్నికల్లో ఐకమత్యంతో కలిసి పనిచేయాలని కెటిఅర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

సమయానికి సెన్సెక్స్ 533.50 పాయింట్లు నష్టపోయి 84,679.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167.20 పాయింట్లు క్షీణించి 25,860.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్ అత్యధికంగా 5 శాతం వరకు పతనమయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ వంటి హెవీవెయిట్ షేర్లు కూడా ఒక శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా లాభపడి మార్కెట్‌కు కొంత మద్దతునిచ్చాయి. ఎం%అ%ఎం, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్ షేర్లు కూడా స్వల్ప లాభాలతో గ్రీన్‌లో ముగిశాయి. విస్తృత మార్కెట్లోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.83 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.92 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ సూచీలు నష్టాల్లో ముగియగా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా రంగాల షేర్లు మాత్రమే లాభపడ్డాయి. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరింత క్షీణించి 91.01 వద్ద చారిత్రక కనిష్ఠ స్థాయికి చేరింది. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీ 25,870 కీలక సపోర్ట్ స్థాయిని కోల్పోవడం వల్ల బేరిష్ సెంటిమెంట్ పెరిగింది. స్వల్పకాలంలో నిఫ్టీ 25,700 స్థాయికి దిగివచ్చే అవకాశం ఉందని, ఎగువన 25,950-26,000 జోన్ కీలక నిరోధకంగా పనిచేయవచ్చని విశ్లేషిస్తున్నారు.

# లీక్ వీరులకు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

మీడియాలో ఒవైసీ పార్టీ కన్నా వెనుకబడ్డారని ప్రధాని అన్నట్లు వార్తలు రావడం పార్టీలో కలకలం రేపింది. ఈ ప్రచారంపై కిషన్ రెడ్డి స్పందిస్తూ అవన్నీ నిరాధారమైన కథనాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎలాంటి క్లాస్ తీసుకోలేదని, కేవలం పార్టీ బలోపేతానికి, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండటానికి కొన్ని సలహాలు, సూచనలు మాత్రమే ఇచ్చారని స్పష్టం చేశారు. అంతర్గత సమావేశంలోని విషయాలను బయటకు లీక్ చేయడం కచ్చితంగా తప్పేనని అన్నారు. ఈ లీక్‌ల వెనుక ఉన్న 'లీకు వీరులు' ఎవరో తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనతో తెలంగాణ కమలంలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయని, ఆ లీడర్లు ఎవరనే దానిపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది.

# పెన్షన్ దయాదాక్షిణ్యం కాదు, హక్కు

డిసెంబర్ 17ను జాతీయ పెన్షనర్ల దినోత్సవంగా జరుపుకోవడం అనవాయితీ. దేశవ్యాప్తంగా జిల్లా, మండల పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో అందుబాటులో గల సభ్యులంతా ఒక్కచోట చేరి, సీనియర్లకు సన్మానాలు, సత్తమ సేవకులకు అభినందనలు, పాత కొత్త విశ్రాంతుల కలయికలతో వేడుకగా సామూహిక భోజనాది కార్యక్రమాలను ఏటా నిర్వహించు కోవడం సంప్రదాయంగా మారింది. పెన్షన్ పొందడం ఉద్యోగికి ఒకరి ద్వారా దయాదాక్షిణ్యమో, భిక్షా కాదని, సుదీర్ఘ జీవన పోరాటంలో చేసిన త్యాగాలు, అందించిన అమూల్య సేవలకు గుర్తింపుగా, పెన్షన్ పొందే హక్కు ఉద్యోగికి ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర చూడ్ నేతృత్వంలోని న్యామూర్తులు డి.ఎన్. నకారా కేసులో 1982 డిసెంబర్ 17నే యాదృచ్ఛికంగా పెన్షనర్లకు అనుకూల తీర్పు వెలువరించారు. సదరు తీర్పు తో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం ద్వారా చట్ట భద్రత కలిగింది. జీవిత మలి సంధ్యలో కోట్లాది రూపాయలు సంపాదించిన వారు కూడా తమ కుటుంబ సభ్యుల చేత నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటారు. అయితే ఉద్యోగ విరమణ చేసిన పింఛను దారుల జీవిత చరమాంకం ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. విశ్రాంత ఉద్యోగి మరొకరికి భారం కాకుండా జీవించి ఉన్నన్ని రోజులు నెల నెలా పెన్షన్ రూపం లో డబ్బు చేతికి అందుతోంది. 80కి వయసు వచ్చినా పెన్షనర్లు ఉల్లాసంగా ఉండడానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ సౌకర్యం అనేది ఎవరూ కాదన లేని వాస్తవం. 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వంకు సేవలందించి పదవీ విరమణ చెందిన ఉద్యోగులకు ప్రతి నెల ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతి పెన్షన్. అలాంటి పెన్షన్ పై ఆదాయపు పన్ను రద్దు చేయాలని గత 5 ఏళ్లుగా తెలంగాణ పెన్షనర్స్ ఆధ్వర్యంలో వివిధ రీతుల్లో ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 4 ఏళ్లుగా ఢిల్లీ వెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తున్నారు. ప్రధాన మంత్రికి, దేశ ఆర్థిక మంత్రికి పోస్ట్ కార్డులు పంపుతూ పెన్షనర్స్ కు ఆదాయపు పన్ను రద్దు చేయాలని మనవి చేస్తున్నారు. అయినప్పటికి కేంద్రం నుంచి స్పందన లేక పోవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్ మొదటి వారంలో ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్ ,మున్సిపల్ చైర్మన్ ల తో ప్రధాన మంత్రికి పోస్ట్ కార్డుల వినతులు పంపించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 లో బడ్జెట్ లో నైనా పెన్షనర్స్ కు ఆదాయపు పన్ను మినహాయింపు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం లక్ష్యంగా 2013 లో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అస్సోసియేషన్ ను హైదరాబాద్ లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. 1969లో తెలంగాణ తొలి, తర్వాత మలి దశ ఉద్యమాల్లో పనిచేస్తూ, పలుసార్లు అరెస్టులకు గురయిన జగిత్యాల పట్టణ వాసి హరి అశోక్ కుమార్ లాంటి చిత్తశుద్ధి పట్టుదల గల సమర్థ నాయకుల సలహాలతో ఎన్నో ఉద్యమాలు నడుస్తున్నాయి. కేసిఆర్ నేతృత్వంలోని గత రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం పీఆర్సీ ఇచ్చింది. పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంచింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా 70 ఏళ్లకే క్వాంటం పెన్షన్, గ్రాట్యుటీ రూ.16 లక్షలకు మంజూరు చేయడం జరిగింది. పెన్షనర్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణలకు టీ యాప్ సౌకర్యం కల్పించి పలు ఇబ్బందులను ప్రభుత్వం తొలగించింది. అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో ఆరోగ్య కార్డుల నగదు రహిత వైద్య సేవలు అందించాలని, పీఆర్సీ బకాయిలు వాయిదాలు లేకుండా ఒకేసారి చెల్లించాలని, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వంను , పెన్షనర్ల కు ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కేంద్ర ప్రభుత్వంను పెన్షనర్లు కోరడం సమంజసం. దేశానికి స్వాతంత్రం వచ్చాక మౌలిక సదుపాయాలు లేని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవలందిస్తునే ఉన్నారు. సమాజం విప్లవాత్మక మార్పులు రావాలన్నా అభివృద్ధి పనులు అందరికీ ఉపయోగపడాలనే ఆలోచనలకు అనుభవం అతి ముఖ్యమైన అంశం. తమ జీవితం అంతా ప్రజా శ్రేయస్సు కోసం ఉద్యోగ ప్రయాణం చేసి విశ్రాంతి తీసుకుంటూ తమ అనుభవాలను, ఆలోచనలను అందిస్తూ.. విశ్రాంత ఉద్యోగులు సమాజాభివృద్ధికి పాటు పడుతున్నారు. ప్రభుత్వం సీనియర్ సీటీజన్స్, పెన్షనర్స్ ను దృష్టిలో ఉంచుకొని పలు రాయితీలు కల్పించాలని పెన్షనర్లు కోరుతున్నారు. ఆర్టీసి బస్సుల్లో, రైళ్లలో 50 శాతం రాయితీ కల్పించాలని, ఆరోగ్య కార్డులు ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, ఆదాయపు పన్ను నుంచి పెన్షనర్స్ ను మినహాయించాలని చేస్తున్న విజ్ఞప్తులు న్యాయబద్ధం అని భావించాలి.

## ప్రశాంత్ కిషోర్‌తో ప్రియాంక గాంధీ భేటీ.. రహస్య భేటీపై ఊహాగానాలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాతో జన్ సూరజ్ పార్టీ అధినేత, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ గతవారం ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసంలో సమావేశమైనట్టు విశ్వసనీయ వర్గాలు జాతీయ మీడియాకు సోమవారం వెల్లడించాయి. బిహార్ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్, జేఎస్పీలు దారుణ పరాజయం అనంతరం ఈ భేటీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. బీజేపీ, కాంగ్రెస్ సహా పలు పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించి వాటిని విజయతీరాలకు చేర్చిన ప్రశాంత్ కిషోర్.. తన సొంత రాష్ట్రం బిహార్‌లో మాత్రం బొక్కబోర్లాపడ్డారు. ఆయన పార్టీ ఒక్కటంటే ఒక్కసీటు కాదు.. కనీసం ఎక్కడా డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయింది. ఈ సమావేశం గురించి ప్రియాంక గాంధీని వివరణ కోరగా.. "నేను ఎవరిని కలుస్తాను... లేదా ఎవరిని కలవను అనే దానిపై ఎవరికీ ఆసక్తి లేదు" అని అన్నారు, అయితే పీకే మాత్రం కాంగ్రెస్ నాయకురాలితో ఎలాంటి సమావేశం జరగలేదని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. ఏది ఏమైనప్పటికీ, ప్రియాంక గాంధీ-పీకే భేటీ గురించి తెలిసిన వర్గాలు మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల్లో ఇరు పార్టీల ప్రదర్శన గురించి మాట్లాడుకున్నట్టు తెలిపారు. జన సురాజ్ 238 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి ఒక్కటి కూడా గెలవలేదు, కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేసి కేవలం ఆరింటిలో మాత్రమే గెలిచింది. 2020 ఎన్నికలతో పోలిస్తే 13 స్థానాలు తక్కువ. ఇక, 2017లో కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్ పనిచేశారు. అప్పుడు జరిగిన పంజాబ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా.. యూపీలో మాత్రం సమాజ్‌వాదీ పార్టీ-కాంగ్రెస్ కూటమికి ఓటమి తప్పలేదు. కాంగ్రెస్ నేతలు కొందరు పీకే తీరుపై విమర్శలు గుప్పించగా.. ప్రశాంత్ కిషోర్ సైతం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం తనకు 'చేదు అనుభవం'గా మారిందని ఆరోపించారు. పార్టీ సంస్థాగత సంస్కృతి, నిర్ణయాలు తీసుకునే విధానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీ పథకం స్థానంలో మరో కొత్త పథకం

న్యూఢిల్లీ: దేశంలో గ్రామీణ ఉపాధి హామీ విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ప్రస్తుత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు కొత్త బిల్లును ప్రభుత్వం లోక్‌సభ సభ్యులకు సర్క్యులేట్ చేసింది. గ్రామీణ ఉపాధి హామీ కోసం 2005లో రూపొందించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి.. దాని స్థానంలో 'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఔర్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు 2025'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) జాతీయ లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణాభివృద్ధి ఫ్రేమ్‌వర్క్‌ను స్థాపించడం ఈ బిల్లు యొక్క ప్రధాన లక్ష్యం. అయితే ఈ కొత్త చట్టం ప్రకారం.. గ్రామీణ కుటుంబంలో నైపుణ్యం లేని పనులకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వయోజనులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీ లభించనుంది. (ప్రస్తుత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కంటే 25 రోజులు ఎక్కువ). ఈ చట్టం ముఖ్య ఉద్దేశం "శక్తిని, వృద్ధిని, సమన్వయాన్ని, సంతృప్తిని" ప్రోత్సహించి సంపన్నమైన, సుస్థిరమైన గ్రామీణ భారతాన్ని నెలకొల్పడం. ఈ బిల్లు లోక్‌సభ సభ్యులకు సర్క్యులేట్ అయింది. డిసెంబర్ 1వ తేదీన ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 19న ముగియనున్నాయి. ఈ సమావేశాల్లోనే కొత్త బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గ్రామీణ ఉపాధికి హామీని ఇచ్చే నరేగా చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఆ తర్వాత 2009 అక్టోబర్ 2 నుంచి ఈ చట్టాన్నిమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గా పేరు మార్చారు. దేశంలోని పేద ప్రజలకు కనీస ఉపాధిని అందించడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషించింది. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ చట్టం స్థానంలో కొత్త బిల్లు రావడం దేశ ఆర్థిక విధానంలో ఒక ముఖ్యమైన మార్పుగా పరిగణించబడుతోంది.

## చిలీ అధ్యక్ష ఎన్నికల్లో జోస్ ఆంటోనియో కాస్ట్ విజయం



చిలీ అధ్యక్ష ఎన్నికల్లో మితవాద అల్ట్రా-కన్జర్వేటివ్ అభ్యర్థి జోస్ ఆంటోనియో కాస్ట్ విజయం సాధించారు. పెరుగుతున్న నేరాలు, వలసలపై ఓటర్ల భయాలను ఉపయోగించుకోవడంలో అల్ట్రా-కన్జర్వేటివ్ సఫలమైంది. దీంతో 1990 సైనిక నియంతృత్వం తరువాత చిలీలో అత్యంత తీవ్రమైన మితవాద పార్టీ గెలుపొందిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాస్ట్ ప్రత్యర్థి అయిన వామపక్ష సంకీర్ణ అభ్యర్థి కమ్యూనిస్ట్ జీనెట్ జారా ఓటమి పాలైయ్యారు. ప్రాథమిక ఫలితాల ప్రకారం, కాస్ట్ 58% ఓట్లు పొందగా, వామపక్ష ప్రభుత్వంలో మాజీ కార్మిక మంత్రి అయిన జారా 41% ఓట్లను పొందారు. సరిహద్దు గోడలను నిర్మించడం, అధిక నేర ప్రాంతాలకు సైన్యాన్ని మోహరించడం, దేశంలో అక్రమంగా ఉన్న వలసదారులందరినీ బహిష్కరించాలని కాస్ట్ ప్రతిపాదించారు.

## భద్రతా హామీలు ఇస్తే నాటోలో చేరే ఆలోచన విరమించుకుంటాం



ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ రష్యా యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధమని ప్రకటిస్తూ.. కీలక ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. రష్యా నుంచి భవిష్యత్తులో దాడులు జరగకుండా పశ్చిమ దేశాల నుంచి భద్రతా హామీలు లభిస్తే.. తమ దేశం నాటో కూటమిలో చేరాలనే ప్రయత్నాన్ని విరమించుకోవడానికి సిద్ధమని ఆయన ఆదివారం బెర్లిన్‌లో ప్రకటించారు. ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 28 పాయింట్ల ప్రణాళికను తీసుకొచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే దీన్ని జెలెన్స్కీ వ్యతిరేకించగా.. ఇరు దేశాల మధ్య గత కొన్ని వారాలుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఈ చర్చల్లో భాగంగానే ఆదివారం రోజు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లతో జెలెన్స్కీ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జర్మన్ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ కూడా పక్కనే కూర్చొని ఉన్న చిత్రాన్ని జెలెన్స్కీ పోస్ట్ చేశారు. నాటోలో చేరాలనే ఉక్రెయిన్ ప్రయత్నాలను అమెరికాతో పాటు కొన్ని ఐరోపా దేశాలు తిరస్కరించిన నేపథ్యంలో.. నాటో సభ్య దేశాలకు ఉన్న తరహాలోనే భద్రతా హామీలను పశ్చిమ దేశాలు తమకు అందించాలని జెలెన్స్కీ కోరారు. "ఈ భద్రతా హామీలు రష్యా నుంచి మరో దాడిని నిరోధించేందుకు ఒక అవకాశం. ఇది మా వైపు నుంచి చేస్తున్న రాజీ" అని జెలెన్స్కీ విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. అయితే రష్యాకు తమ భూభాగాన్ని అప్పగించాలనే అమెరికా ప్రతిపాదనను జెలెన్స్కీ పూర్తిగా తిరస్కరించారు. తూర్పు ప్రాంతంలోని డొనెట్స్క్ నుంచి ఉక్రెయిన్ బలగాలను ఉపసంహరించుకుని.. అక్కడ సైన్యం లేని స్వేచ్ఛా ఆర్థిక మండలిని ఏర్పాటు చేయాలనే అమెరికా ఆలోచన ఆచరణ సాధ్యం కాదని ఆయన కొట్టిపారేశారు. "ఈ ఆర్థిక మండలిని ఎవరు నిర్వహిస్తారు? అని ప్రశ్నించిన ఆయన.. తాత్కాలికంగా సరిహద్దు వెంబడి బఫర్ జోన్ ఏర్పాటు చేస్తే ఉక్రెయిన్ దళాలు 5 నుంచి 10 కిలో మీటర్లు వెనక్కి తగ్గితే, రష్యా దళాలు కూడా అదే దూరం వెనక్కి ఎందుకు తగ్గకూడదు?" అని జెలెన్స్కీ ప్రశ్నించారు.

## పరువు నష్టం దావా వేస్తా.. బీబీసీకి ట్రంప్ వార్నింగ్

ప్రముఖ మీడియా సంస్థ బీబీసికి ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. అమెరికాలోని క్యాపిటల్ హిల్ పై దాడి సందర్భంగా 2021లో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని వక్రీకరించారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన ప్రసంగం మార్చినందుకు ఆ సంస్థపై 5 బిలియన్ డాలర్ల దావా వేస్తానని హెచ్చరించారు.

మరోవైపు ఇప్పటికే ట్రంప్ న్యాయబృందం సదరు మీడియా సంస్థకు లేఖ రాసింది. దీంతో క్షమాపణలు చెప్పి బీబీసీ ఐదు బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు నిరాకరించింది. బీబీసీ క్షమాపణలు చెప్పినప్పటికీ మరోసారి ట్రంప్ ఆ సంస్థపై దావా తప్పదని హెచ్చరించారు. వచ్చే వారం బీబీసీపై 1 బిలియన్ డాలర్ల నుండి బిలియన్ డాలర్ల వరకు కోర్టులో దావా వేస్తున్నట్టు పేర్కొన్నారు. దీని గురించి బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తో చర్చిస్తానని వెల్లడించారు. ఇక ఇప్పటికే ట్రంప్ రాజకీయంగా ఒత్తిడి తీసుకురావడంతో ప్రభుత్వ నిధులతో నడిచే బీబీసీకి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేశారు. అయినప్పటికీ ట్రంప్ వదిలిపెట్టలేదు. తన ప్రసంగం మార్చినందుకు దావా వేస్తానని మరోసారి హెచ్చరించారు.

## ఘోర విమాన ప్రమాదం.. 10 మంది మృతి !

మెక్సికోలో పెను విషాదం చోటుచేసుకుంది. మెక్సికోలోని టోలుకా విమానాశ్రయ సమీపంలో ఓ విమానం ప్రమాదానికి గురైంది. మెక్సికో పసిఫిక్ తీరంలోని అకాపుల్కో నుంచి బయలుదేరిన ఓ మినీ జెట్ కుప్పకూలినట్లు తెలుస్తోంది.అత్యవసర లాండింగ్ కు ప్రయత్నించిన ఆ మినీ జెట్, అక్కడే కుప్పకూలిందని అంటున్నారు అధికారులు. ఈ సంఘటనలో ఇద్దరు సిబ్బందితో పాటు ఏకంగా 10 నుంచి 8 మంది ప్రయాణికులు మరణించినట్లు నేషనల్ మీడియాలో ఒక కథనాలు వస్తున్నాయి. ఈ ప్రమాదం జరిగిన సమీపంలోనే ఓ ఫుట్ బాల్ స్టేడియం ఉంది. ఆ స్టేడియంలోనే అత్యవసర ల్యాండింగ్ కు పైలెట్ ప్రయత్నించాడట. కానీ పరిస్థితి అదుపు తప్పడంతో అక్కడే ఉన్న ఓ కంపెనీ పైకప్పు పై ఆ మినీ జెట్ పడి, పేలిపోయింది. ఈ సంఘటన జరిగిన వెంటనే అలర్ట్ అయిన అధికారులు, సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అటు ఈ మినీ జెట్ కింద పడిన వీడియో కూడా బయటకు వచ్చింది. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## ఢిల్లీలో దట్టమైన పొగమంచు.. విమాన, రైలు రాకపోకలకు తీవ్ర అంతరాయం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాలు మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచుతో కమ్ముకుపోయాయి. వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడంతో సాధారణ జీవనం అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొగమంచు ప్రభావంతో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 228కు పైగా విమానాలు రద్దయ్యాయి. మరో 800కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఐదు విమానాలను ప్రత్యామ్నాయ విమానాశ్రయాలకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది. పొగమంచు కారణంగా రద్దైన విమానాల టికెట్లకు రీషెడ్యూల్ లేదా రీఫండ్ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించింది. మరోవైపు రైల్వే అధికారులు పలు రైళ్లు 6 నుంచి 7 గంటల వరకు ఆలస్యంగా నడుస్తున్నట్లు వెల్లడించారు. పరిస్థితిని నియంత్రించేందుకు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ కింద అత్యంత కఠినమైన స్టేజ్- 4 ఆంక్షలను అమలు చేసింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులపై నిషేధం విధించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో 50 శాతం సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా 10వ తరగతి మినహా మిగిలిన తరగతులకు హైబ్రిడ్ విధానంలో తరగతులు నిర్వహించాలని పాఠశాలలకు సూచించారు.

## నాలుగు బస్సులకు అంటుకున్న మంటలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మథురాలో యమునా ఎక్స్‌ప్రెస్‌వే (ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వే)పై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఆగ్రా-నోయిడా లేన్‌లో 127 మైలురాయి వద్ద పొగమంచు కారణంగా మూడు కార్లతో పాటు ఏడు బస్సులు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. స్పాట్‌లోనే మంటలు చెలరేగడంతో అన్ని వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. అందులో ఒక రోడ్‌వేస్ బస్సు, మిగతా ఆరు స్లీపర్ బస్సులు ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు స్పాట్‌కు చేరుకున్న పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఈ దుర్ఘటనలో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందినట్లు మథురా (రూరల్) ఎస్పీ సురేష్‌చంద్ర రావత్ వెల్లడించారు. ప్రస్తుతానికి మంటలు అదుపులోకి వచ్చాయని, నాలుగు మృతదేహాలను వెలికితీశామని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## హిమాలయాల్లో మిస్సైన అణు పరికరం



న్యూఢిల్లీ: ఇతర దేశాల ఇదా నిఘా కోసం భారత్ ఓ అణు పరికరాన్ని హిమాలయాల్లో అమర్చింది. అయితే ప్రస్తుతం దాని జాడ లభించక ఆందోళన చెందుతోంది. ఇంతకీ ఏం జరిగిందంటే.. 1965లో చైనా అణు కార్యక్రమాలపై నిఘా కోసం భారత్ అమెరికా సిఐఎ కలిసి హిమాలయాల్లోని నందాదేవి శిఖరంపై అణుశక్తితో పనిచేసే ఓ నిఘా పరికరాన్ని ఏర్పాటు చేయాలని భావించింది. అనుకున్నట్టుగానే సిబ్బంది, అధికారులు నందాదేవి శిఖరం మీదకి చేరిన సమయంలో తీవ్ర మంచు తుఫాను సంభవించింది. అయితే ఆ మంచు తుఫాను నుంచి తప్పించుకునే క్రమంలో ఆ అణు పరికరాన్నిఅక్కడే వదిలేసి అంతా శిఖరం కింది క్యాంపుకి తిరిగి వచ్చారు. అయితే 2 రోజులు గడిచాకా మంచు తుఫాను శాంతించడంతో మళ్ళీ అధికారులంతా శిఖరం పైకి చేరుకున్నారు. కానీ అనూహ్యంగా అక్కడ అణు పరికరం వారికి కనబడలేదు. అంతా కలిసి అనేక గంటలపాటు వెతికినా దాని జాడ దొరకలేదు. అయితే మంచులో కూరుకుపోయి ఉంటుందని భావించి దాని మీద ఆశలు వదిలేసుకున్నారు. కాగా ఇటీవల హిమానినాదాలు వేగంగా కరిగిపోతుండటంతో ఆ అణు పరికరంలో రేడియోధార్మిక పదార్థం లీకయ్యి పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హిమనీనాదాలు కరిగి నదుల్లోకి ప్రవహిస్తుండగా.. అణు పదార్థం లీక్ అయితే నదులన్నీ కలుషితం అవుతాయని, దాంతో లక్షలాది మంది రేడియోధార్మికత బారిన పడతారాని హెచ్చరిస్తున్నారు. అయితే ఈ విషయాలన్నీ.. ఇటీవల బీజేపీ ఎంపీ నిశికాంత్ ట్వీట్ తో బయటికి రాగా.. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్ అవుతోంది.

## మెట్రో పనుల ఆలస్యంపై మంత్రి ఆగ్రహం.. నెటిజన్‌ల ప్రశంసలు!



బెంగళూరు: నగరంలో మెట్రో పనుల ఆలస్యంపై ఓ మంత్రి అధికారులపై మండిపడ్డారు. ఇందు కు సంబంధించిన వీడియో నెట్టింట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బెంగళూరులోని నాగరవార-బాగలూరు క్రాస్ మెట్రో ఫేజ్-2బీ పనుల పరిశీలనలో కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ భైరే గౌడ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండేళ్లుగా పిల్లర్లు పూర్తి కాకపోవడం, ఏడాదిగా రోడ్లు మూసివేయడంపై మెట్రో అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆయన నిలదీశారు. పనుల ఆలస్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం లేని రోడ్డు బారికేడ్లను తొలగించాలని, చెత్తను వెంటనే శుభ్రం చేయాలని, పనులు వేగంగా పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరిస్తూ, జవాబుదారీతనంతో సమన్వయంగా పనులు పూర్తిచేయాలని వారికి సూచించారు. ఈ ఘటనపై నెటిజన్‌లు మంత్రిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలాంటి మంత్రులు మనకు కావాల్సిందని పలువురు నెటిజన్‌లు అభిప్రాయపడ్డారు.

## ఢిల్లీ సర్కార్ సంచలన నిర్ణయం.. తందూరీ వంటకాలపై నిషేధం

న్యూఢిల్లీ: ప్రస్తుత శీతాకాలంలో దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ దారుణంగా పడిపోతున్న నేపథ్యంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఢిల్లీలో కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు రేఖా గుప్తా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోపాటు..కేంద్ర ప్రభుత్వం అనేక కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ.. గాలి నాణ్యత మాత్రం మెరుగుపడటం లేదు. ఈ నేపథ్యంలో రోజురోజుకూ మరిన్ని కఠినమైన ఆంక్షలను ప్రవేశపెడుతున్నారు. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో డిసెంబర్ 9వ తేదీన బొగ్గు, కట్టెలతో తయారు చేసే బహిరంగ తందూరీలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ తినుబండారాల్లో బొగ్గు, కట్టెలతో పనిచేసే ఓపెన్ తందూర్‌లను పూర్తిగా నిషేధిస్తూ ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం అమలులోకి రావడంతో.. ఆయా హోటళ్లు ఎప్పటి నుంచో తయారు చేస్తున్న వంటకాల తయారీ కోసం ప్రత్యామ్నాయ వంట పద్ధతుల (ఎలక్ట్రిక్ లేదా గ్యాస్ తందూర్‌లు) వైపు అడుగులు వేస్తున్నాయి. ఈ నిర్ణయంతో ఢిల్లీలోని హోటళ్లు, రెస్టారెంట్లు కీలక నిర్ణయం తీసుకుంటున్నాయి. లోధీ కాలనీలోని ఎంఐ ఫుడ్ సెంటర్‌లో.. తందూరీ వంటకాలే ప్రధానంగా విక్రయిస్తారు. ఇప్పుడు తందూరీపై నిషేధం విధిస్తే.. తాము హోటల్ మెనూ మొత్తం మార్చాల్సిందేనని నిర్వాహకులు తెలిపారు. కస్టమర్‌లు ఆ పొగ రుచిని ఆశించే తమ హోటల్‌కు వస్తారని.. రాత్రికి రాత్రే దాన్ని మార్చేయడం అంత సులభం కాదని పేర్కొన్నారు. మాల్వియా నగర్‌లోని ఒబెరాయ్ దాబా మాత్రం.. ఢిల్లీ నగరంలో కలుషితమైన గాలి పెరిగిపోతున్న దృష్ట్యా ఈ మార్పు చాలా అవసరమని పేర్కొంది. ఈ నిర్ణయం కష్టమే అయినప్పటికీ.. చాలా ముఖ్యమని తెలిపింది.

# అసమాన సేవాతత్పరుడు జనరల్ తిమ్మప్ప

జనరల్ కోదండర సుబ్బయ్య తిమ్మయ్య భారత సైన్యంలో ఒక విశిష్ట సైనికుడు. అయన 1957 నుండి 1961 వరకు భారత చైనా దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో భారత సైన్యంలో ఛీఫ్ ఇన్ ఆర్మీ స్టాఫ్‌గా కీలకమైన సేవలను అందించారు. రెండవ ప్రపంచ యుద్ధం పదాతి దళానికి నాయకత్వం వహించిన ఏకైక భారతీయుడు. ఆయన భారత సైన్యం అందించిన విశిష్ట అధికారిగా గుర్తింపు పొందారు. కొరియా యుద్ధం తరువాత, యుద్ధ ఖైదీలను వారి వారి దేశాలకు తిరిగి పంపే పనిలో ఐక్యరాజ్య సమితి విభాగానికి నాయకత్వం వహిం చారు. ఆర్మీ నుండి పదవీ విరమణ చేసిన తరువాత 1964 జూలై నుండి డిసెంబరు 1965 వరకు సైప్రస్ దేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి సంరక్షక దళానికి కమాండ ర్‌గా నియమించబడ్డారు. సైప్రస్ లో 17 డిసెంబరు 1965లో మరణించారు. ఆయన కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా (పూర్వపు పేరు కూర్గ్) మద్దికెరి గ్రామంలో 1906, మార్చి 30వ తేదీన తిమ్మయ్య సీతమ్మ దంపతులకు జన్మించారు. తల్లి సీతమ్మ విద్యావంతురాలు, సంఘ సేవకురాలు. ఆమెకు బ్రిటిష్ ప్రభుత్వం కైసర్ – ఎ– హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఆయ న అన్న పొన్నప్ప, తాను, తమ తమ్ముడు సోమయ్య ముగ్గురూ భారత సైన్యం లో అధికారులుగా పనిచేశారు. మెరుగైన విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో తన 8వ యేటనే తమిళ నాడు రాష్ట్రం కూనూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరారు. ఆ తర్వాత బెంగళూరు లోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూలులో చదివారు. ప్రాథమిక విద్య ముగిసి న తరువాత డెహ్రాడూన్ లోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజీలో చేరారు. అక్కడి నుండి పట్టా పొందిన తరువాత ఆయన ఇంగ్లాండు లోని రాయల్ మిలటరీ కాలేజీకి తర్వాత శిక్షణ కోసం ఎంపిక చేయ బడ్డారు. మిలటరీ శిక్షణ తరువాత 1926 ఫిబ్రవరి 4న అయనను బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించారు. ఆ బ్యాచ్‌లో నియమింప బడిన వారిలో ఆయన తరువాత ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేసిన ప్రాణ్ నాథ్ థాపర్ ఉన్నారు. తిమ్మయ్య 19వ హైదరాబాద్ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్‌లో 1927 మే 28 న నియమించ బడ్డారు. 1928 మే 4 న ఇతడు లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందారు. 1930లో రెజిమెంటల్ సహాయాధికారిగా నియమించిన తరువాత తన నైపుణ్యంతో నార్త్ వెస్ట్ ఫ్రంటియర్ (నేటి పాకిస్తాన్) లోని పఠాన్ ఆదివాసీ తిరుగుబాటు దారులను అణచగలిగారు. 1935 ఫిబ్రవరి 4న ఇతడు కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. 1936 ఏప్రిల్‌లో ఇతడు మద్రాసులోని యూనివర్సిటీ ట్రైనింగ్ కార్ప్స్‌కు సహాయాధికారిగా బదిలీ కాబడ్డారు. తరువాత ఆయనను సింగపూర్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. 1941లో ఆయనను ఆగ్రాలోని హైదరాబాద్ రెజిమెంటల్ సెంటర్‌లో సెకండ్ - ఇన్ - కామాండ్‌గా నియమించారు. తరువాత ఇతనిని క్వెట్టాలోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ కోసం పంపారు. అక్కడ అయన, అయన భార్య 1935 క్వెట్టా భూకంప బాధితులకు ఎనలేని సేవలను అందించారు. 1943లో ఆయనను మేజర్ పదవి లభించింది. ఇతడు 25వ పదాతి దళానికి గ్రేడ్2 స్టాఫ్ ఆఫీసర్‌గా నియమితుడైనారు. సైన్యంలో ఆ పదవిని వరించిన తొలి భారతీ యుడు తిమ్మయ్య. పదాతి దళం అడవులలో యుద్ధ శిక్షణను పొంది రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ సేనలను బర్మాలో ఎదుర్కొంది. 1944లో అయన లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొంది బర్మాలో 8వ, 19వ హైదరాబాద్ రెజిమెంట్ లకు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1945లో ఇతడు బ్రిగేడియర్ ర్యాంకుకు ఎదిగారు. యుద్దంలో అయన సేవలకు గుర్తింపుగా డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్(%ఙ.వా.వా%)ను ప్రకటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయనను స్వదేశానికి వెనుకకు రప్పించారు. 1947లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత పాకిస్తాన్ విభజన సందర్భంగా భారత్ పాకిస్తాన్‌ల మధ్య ఆయుధాలు, పనిముట్లు, సైన్యం పంపకాల కమిటీలో ఆయనను సభ్యుడిగా నియమించారు. దాని తరువాత సెప్టెంబర్ 1947లో మేజర్ జనరల్‌గా పదోన్నతి కల్పించి 4వ పదాతి దళానికి కమాండ్‌గా నియమించారు. 1948లో కాశ్మీర్‌లో జరిగిన భారత్–పాక్ యుద్ధంలో ఇతడు క్రియాశీలక పాత్రను నిర్వహించారు. 19వ పదాతి దళానికి కమాండర్‌గా వ్యవహరిస్తూ కాశ్మీర్ లోయ నుండి పాకిస్తాన్ సేనను తరిమికొట్టారు. షేక్ అబ్దుల్లా, బక్షి గులాం మొహ మ్మద్, జవహర్‌లాల్ నెహ్రూలతో సత్సంబంధాలను ఏర్పరచుకున్నారు. డెహ్రాడూన్ లోని ప్రతిష్టాత్మక ఇండియన్ మిలటరీ అకాడమీకి కమాండెంట్‌గా వ్యవహరించారు. ఆయనకు గల అపార అనుభ వాన్ని పరిగణనలో తీసుకుని ఐకరాజ్య సమితి... తటస్థ దేశాల రిపాట్రియేషన్ కమీషన్‌కు ముఖ్యునిగా నియమించి కొరియాకు పంపింది. ఇది చాలా సున్నితమైన, అసాధారణమైన పని కావడంతో చాకచక్యంతో నెరవేర్చ గలిగారు. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చి లెఫ్టినెంట్ జనరల్ హొదాలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్, సదరన్ కమాండ్‌గా 1953లో నియమితుడైనారు. 1954లో ఇతనికి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. ఆయన 1957, మే 7న 6వ ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలను చేపట్టారు. 1959లో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి వి. కె. కృష్ణ మేనన్ తో ఏర్పడిన విభేదాల కారణంగా పదవికి రాజీనామా చేశారు. కానీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అయన రాజీనామాను తిరస్కరించడంతో పదవిలో కొనసాగారు. 35 ఏళ్ల మిలటరీ సర్వీసు పూర్తి చేసుకుని 1961 మే 7న పదవీ విరమణ చేశారు. భారత సైన్యం నుండి పదవీ విరమణ తరువాత ఐక్యరాజ్య సమితి ఆయన సేవలను మరోసారి ఉపయోగించ తలపెట్టి, సైప్రస్‌లో ఐక్యరాజ్య సమితి సేనలకు కమాండర్‌గా జూలై 1964లో నియమించింది. ఆ పదవిలో ఉన్న సమయం లోనే 1965, డిసెంబరు 17న మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని అంత్యక్రియల కోసం బెంగళూరుకు తరలించారు. అయన స్మృత్యర్థం బెంగళూరు, పూనే, సైప్రస్‌లోని లార్నకా నగరాలలో కొన్ని వీధులకు జనరల్ తిమ్మయ్య రోడ్ అని నామకరణం చేశారు. 1966లో రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ ఇతని స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసి గౌరవించింది.

# గోదాదేవి పాశురాలలో సామాజిక దృక్పథం

తిరుప్పావై' అనేది దివ్య ప్రబంధం. ఇది ద్రావిడ వేదంగా పరిగణింపబడుతున్నది. 'తిరుప్పావై' అనగా...'తిరు' అంటే శ్రీ. 'శ్రీ' అంటే లక్ష్మి, సంపద, మోక్షం – అని అర్థాలున్నవి. 'పావై' అంటే వ్రతం. నియమ నిష్ఠలతో ఆచరించబడే సంకల్ప వ్రతం' అనబడుతుంది. కలియుగంలో మానవ కన్యగా జన్మించి గోదాదేవిగా పెరెన్నక గన్న ఆండాళ్ భగవంతుడినే తన భర్తగా భావించి, ఆయనను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. తిరుప్పావై విష్ణువును కీర్తిస్తూ, గోదాదేవి మూల ద్రావిడంలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక. పాశురము అంటే ఛందోబద్ధంగా ఉన్న పాటలని అర్థం. ఇది పన్నిద్దరాళ్వార్లు రచించిన నాలాయిర దివ్య ప్రబంధములో ఒక ముఖ్య భాగమై, తమిళ సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ఆండాళ్ అసలు పేరు కోదై. కోదై అంటే మాలిక. ఆ పేరు పెట్టగా, అది క్రమంగా గోదాగా మారింది... గోదాదేవి సామాజిక దృక్పథంతోనే సకలోపనిషత్ సారంగా తిరుప్పావైని రచించి గానం చేసింది. గోదాదేవి రచించిన 30 పాశురాలు స్థూలంగా మంచిని ప్రబోధిస్తాయి. మంచిగా జీవించమని, తోటివారికి సాయపడమని, భగవదారాధన తప్పనిసరిగా చేయమని ఈ ప్రబోధాలు సూచిస్తాయి. మొదటి అయిదు పాశురాలు ఉపోద్ఘాతం, తిరుప్పావై యొక్క ముఖ్యోద్దేశ్యాన్ని తెలియ జేస్తాయి. తరువాతి పది పాశురాల్లో, గోదాదేవి చెలులతో కలిసి పూలను సేకరిస్తూ, పల్లె వాతావరణాన్ని వర్ణించే అంశాలు ఉంటాయి. అనంతర ఐదు పాశురాలు గోదాదేవి తన చెలులతో కలిసి చేసిన దేవాలయ సందర్శనను వివరిస్తాయి. భగవంతుడిని నిద్ర మేల్కొలపడానికి ఆండాళ్ సుప్రభాతాన్ని ఆలపిస్తుంది. చివరి తొమ్మిది పాశురాలు భగవద్విభూతిని వర్ణిస్తాయి. గోదాదేవి పూల లాంటి సహజత్వం, పాలకడలి లాంటి నిర్మలత్వం గల ఆమె జీవన తత్త్వానికి పాటలకు పరవశుడయ్యాడు కృష్ణుడు. తులసీవనంలో పుట్టిన స్వభావ సిద్ధమైన జ్ఞానభక్తి సౌరభ సమృద్ధ గోదాదేవి, భగవంతునే మేల్కొప్పిన పరమ విలక్షణ వ్యక్తిత్వం గల భక్తురాలు. సామాజిక దృక్పథంతో వేదోపనిషత్తుల సారాన్ని, పురాణేతిహాసాల్లోని ధర్మాలను, తన పాటలలో నిక్షిప్తపరచి లోకానికి అందించింది. పాటలలో ఉపనిషత్తు రహస్యాలు శ్రీకృష్ణ లీలలు. పరమాత్మను చేరుకునేందుకు అనుసరించాల్సిన భక్తి మార్గాలు, పల్లె అందాలు, ఉదయకాలపు వర్ణనలు మొదలైన విషయాలు పొందు పర్చబడ్డాయి.

విశ్వమానవ సౌభ్రాతృత్వంతో తనతోపాటు లోకులందరూ తిరుప్పావై వ్రతం ఆచరించాలని 'వైయత్తువాళ్ వీర్ కాళ్' (తి.పా. 2) అంటూ ఈ భూమియందే తరించాలనుకునే వారందరికీ ఆహ్వానం పలికింది గోదాదేవి. గోదాదేవి పరమపదం చేర్చుటకే ప్రధానంగా ఈ ప్రబంధం చెప్పినప్పటికీ ప్రయోజనాలను ఆశించి, మనలను మంచి గుణాలు కలవారిగా తీర్చిదిద్దాలని ఎన్నో మంచి ఉపదేశాలను చేసింది. పెద్దలు చేయని పనులను ఎట్టి పరిస్థితులలో చేయవద్దని, ఒకరి గురించి వారికి నష్టం కలిగించే రీతిలో వేరొకరి వద్దకు వెళ్ళి చాడీలు చెప్పవద్దని.. పేదవారికి, బ్రాహ్మణులకు దానధర్మాలు చేయాలని దాన ధర్మాలు ఎదుటివాడు సంతృప్తి పడినంత చేయడమే కాక ఏమీ చేయని వానివలె గర్వం, అహంకారం లేకుండా ఉండాలని సందేశం ఇచ్చింది. ప్రాతఃకాలంలో స్నానమాచరించడం, సాత్వికాహార స్వీకరణ, విషయ సుఖాలపై విరక్తి, సత్యమార్గానుసరణ, అహంకార మమకారాలకు, దైన్యానికి లోనుకాకుండా ఉండటం మున్నగు అంశాలను అంతర్గతంగా తన పాశురాలలో సందేశాత్మకంగా వివరించింది. మానవుడు పాప పంకిలంలో పడక సచ్ఛీలుడై జీవన్ముక్తుడు కావాలని ఆమె దృక్పథం. మానవులు ఎవరి ధర్మాన్ని వారు తప్పక పాటిస్తే ప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంత జీవనం సాగిస్తారని భావించింది. తిరుప్పావై ధ్వన్యర్థ గ్రంథరాజమని అంగీకరించిన విషయమే. పరుషముగా మాటాడరాదని, అందరిపట్ల పూజ్యభావం కలిగి ఉండాలని, తన తప్పును ఎత్తిచూపినప్పుడు. ఏమాత్రం బాధపడక సంతోషంగా స్వీకరించే ఉత్తమగుణం ఉండాలని అహంకారం పూర్తిగా నశిస్తేనే ఇవి జరుగుతాయని తెలియ జేసింది

ఏది మంచో ఏది చెడో వివేచన చేసుకోమని హెచ్చరించింది. యోగ, ధ్యానాదులు అత్యంత ఆరోగ్య ప్రదాతలనే అంతరార్థాన్ని వక్కాణించింది. చివరి పాశురం ఫలశ్రుతి. ఎవరైతే ఈ పాశురాలు గానం చేస్తారో, వారికి భగవత్ కృప తప్పకుండా కలుగుతుందని అందులో హామీ ఇస్తుంది. గోదాతల్లి సామాజిక దృక్పథంతోనే ప్రజలను భక్తి, నీతి మార్గాలవైపు నడిపించాలని, తానాచరించి చూపిన వ్రతం శ్రీవ్రతం, కాత్యాయని వ్రతం, ధనుర్మాస వ్రతం అనే వ్రతాన్ని ఆచరించి, ఈ ఉత్తమ గుణాలను అలవాటు చేసుకొనగలిగితే ఆ తల్లి సామాజిక స్పృహను అర్థంచేసుకున్న వారమవుతాం. అపురూపమైన, మానవజన్మను సార్థకం చేసుకున్న వారం అవుతాం.

# ఇండిగో అలసత్వం - ప్రభుత్వం మౌనం

ఇటీవల భారతదేశ ప్రధాన రవాణా వ్యవస్థని ఒక్కసారిగా మోకాళ్లపై కూర్చోబెట్టింది ఇండిగో విమానయాన యాజమాన్యం. వందలకొద్ది విమానాలను రద్దు చేస్తున్నామనే ఇండిగో తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఉందో లేదో ఇప్పటికీ స్పష్టం చేయలేదు. ప్రభుత్వం కూడా దాదాపు ప్రయాణికుల మాదిరిగానే అంతా స్తంభించిపోయిన తర్వాత తెలుసుకొన్నట్టుగానే విధితమవుతోంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన వాయు రవాణాకి ఇంతటి అనిశ్చితి ఉండగలదా? ఉండే అవకాశం ఉందని ప్రభుత్వానికి తెలీదా? మరి ఇలాంటి పరిస్థితి ఏర్పడితే ఎంత త్వరితగతిన చర్యలు చేపట్టాలో ప్రభుత్వం దగ్గర విధివిధానాలు లేవా? చేజారిపోయిన పరిస్థితి చూస్తే వాళ్లకి కూడా పరిష్కార మార్గాలకు సంబంధించిన సూచనప్రాయ అధికారాలు కూడా లేవనిపిస్తోంది. ఇండిగో ప్రకటించిన ఈ నిర్ణయం వల్ల సూర్యగ్రహణంలా ఒక్కసారిగా చీకటి కమ్ముకుంది. ఇదేనా వికసిత్ భారత్ అంటే? ప్రభుత్వ రంగంలో అయితే ఇలా జరిగేదా? ఒక్కసారిగా ముందస్తు సమాచారం లేకుండా రవాణా వ్యవస్థ మొత్తం స్తంభించి పోయే అవకాశం ఉండేదా? ఏ రంగమైనా పర్యవసానాలు ఆలోచించకుండా కొత్త నిబంధనలను అకస్మాత్తుగా ప్రభుత్వ రంగంలోని అధికారులు అమలు పరచడానికి అవకాశం ఉందా? ప్రతి రంగమూ, ప్రతి అంశము ప్రభుత్వ రంగంలో కొనసాగించడం అసాధ్యమే. దేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థ విధానాన్ని పాటిస్తున్నది. ప్రయివేటు ప్రభుత్వ రంగాల సమ్మిళిత కొనసాగింపు మంచిదే. కానీ ప్రధాన రంగాలైన రవాణా, ఆర్థిక, కమ్యూనికేషన్, ఇంధన వంటి రంగాలు పూర్తిగా ప్రభుత్వ కనుసన్నల్లో జరగకపోతే ఆపత్కాల పరిస్థితుల్లో పరిస్థితులు ప్రజా సంక్షేమం కోసం అందుబాటులో ఉంటాయా? ప్రభుత్వ రంగం అంటేనే ఒక బూచిలాగా ప్రచారం చేసి, ప్రయివేటు రంగానికి వత్తాసు పాడి, పోటీతత్వంలోనే ప్రోగ్రెస్ ఉందని నమ్మబలికి, ప్రయివేటు ఆధిపత్యాన్ని పెంచి పోషిస్తే ఇలాంటి ఫలితాలు వస్తాయని, ఎప్పుడూ ప్రజాపక్షం వహించే వామపక్షాలు ఊరికనే చెబుతున్నాయా! ఒక్కసారిగా విమాన ప్రయాణం రంగం స్తంభించడంతో మళ్లీ ప్రభుత్వ రంగాల ప్రాధాన్యతను కొందరు రాజకీయ నాయకులు కూడా ప్రస్తుతిస్తుండడం వారి అవకాశవాద ప్రస్తావన తప్ప ప్రభుత్వ రంగాల ప్రాధాన్యతపై వారికున్న చిత్తశుద్ధి ఏమీ కాదు! కేంద్ర ప్రభుత్వం తాము విధించిన విధి విధానాలలో వెనక్కి తగ్గి పూర్వ పరిస్థితులు నెలకొనే విధంగా చర్యలు చేపట్టాలని ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించింది. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతాయి. సాధారణ పరిస్థితులు కొంత ఆలస్యంగానైనా నెలకొనవచ్చు. కానీ స్తంభించిన ఈ కాలంలో జరిగిన వేల కోట్ల రూపాయల నష్టానికి, విలువైన ప్రాణనష్టానికి, ఇతరత్రా పడిపోయిన లావాదేవీలకు బాధ్యులు ఎవరు? కనీసం పోటీతత్వం ఉన్నప్పటికీ ఎయిర్ ఇండియా ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని గగ్గోలు పెడితే దానిని టాటా గ్రూప్‌కు అప్పగించడమే ఎయిర్ ఇండియాకు స్వాతంత్రం వచ్చినంత గొప్పగా చెప్పుకొని ఈ ఇండిగో వ్యవహారంలో బయటపడిన మరో అంశం. పైలెట్లను పరిమితికి మించి వినియోగించడం. ఇది వ్యక్తిగత దోపిడీయే కాకుండా ప్రమాదాలకు పునాది పడే అంశం. అంతర్జాతీయ సంస్థలతో పోలిస్తే భారత దేశంలో పైలెట్లకు పనిభారం ఎక్కువట. దాన్ని నియంత్రించడానికే నియమ నిబంధనలు రూపొందించారు. కానీ అమలుపరిచేటప్పుడు చాలినంత కొత్త పైలెట్లను నియమించుకుని ఉంటే బాగుండేది. అలా చేయకపోవడం వల్లనే ఈ నష్టం జరిగింది. ఈ సందర్భంగా ఇతర ఏయే రంగాల్లో అలాంటి మితిమీరిన వినియోగం జరుగుతుందో తప్పకుండా దృష్టి పెట్టాల్సిందే. దేశంలో అలా జరిగే ప్రధాన రంగం సాఫ్ట్‌వేర్‌రంగం. పరిమితికి మించి శ్రమదోపిడీ జరుగుతున్నది. బయటపడని లైంగికదాడులు ,అఘాయిత్యాలు, అమానుష ఎత్తులు ఎన్నో ఉన్నవి. విమాన ప్రయాణికులు కోట్ల రూపాయలకు పడగలెత్తినవారు కాబట్టి వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వ పెద్దలు మేల్కొని ఉంటారు. కానీ సాఫ్ట్‌వేర్ రంగం, రోడ్డు రవాణా రంగాలు, అసంఘటిత రంగాలలో అలాంటి దోపిడీలు లెక్కకు మించి జరుగుతున్నాయి. ప్రయివేటు వాహనాలన్నీ సింగల్ డ్రైవర్‌తో 24 నడుస్తుంటాయి. వీటన్నిటిని కూడా నియంత్రించడానికి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయకుండా నూతనంగా అమల్లోకి తెచ్చిన లేబర్ కోడ్‌లలో యాజమాన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. శ్రామికులు కూడా "ఇష్టమైతేనే పోవచ్చు" అనే నిబంధన పెట్టి, దానినే రక్షణ కవచంగా భావించాలని సూచిస్తున్నారు. పైలట్ల విషయంలో పనిగంటల గురించిన ఖచ్చితత్వాన్ని మిగతా చోట్ల ఎందుకు పాటించడం లేదు? ఈ వివక్షలో ఎంతమంది మానప్రాణాలను కోల్పోతున్నారో ఊహించడం కష్టమేమీ కాదు. అందుచేత ఈ సందర్భంగా పని గంటలు, పని పరిస్థితులు, పనిచేసే వేళలు, పనికి తగిన ప్రతిఫలాలు, వాటిని పర్యవేక్షించే యంత్రాంగం పరిరక్షించడానికి శ్రామికులకు పటిష్టమైన సంఘాలు ఉండేలా చట్టాలను రూపొందించడం వంటివన్నీ కూడా ప్రధాన చర్చలో భాగం కావాలి. అలాంటి ప్రయత్నాలే "సబ్‌కాసాత్ సబ్‌కావికాస్" అనే నినాదానికి నిజమైన అర్థాన్నిస్తాయి.

# మెస్సీ ఈవెంట్‌లో సీఎం రేఖా గుప్తాకు నిరసన సెగ..

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వేళ, ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు చేదు అనుభవం ఎదురైంది. సోమవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీకి స్వాగతం పలికేందుకు ఆమె వేదికపైకి రాగానే, ప్రేక్షకుల నుంచి 'ఏక్యూఐ, ఏక్యూఐ' (గాలి నాణ్యత సూచీ) అంటూ నినాదాలు వెల్లువెత్తాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో సోమవారం వాయు కాలుష్యం అత్యంత తీవ్రస్థాయికి చేరింది. ఉదయం గాలి నాణ్యత సూచీ 498 పాయింట్లకు పడిపోగా, సాయంత్రానికి 427 వద్ద స్థిరపడింది. దీంతో వరుసగా మూడో రోజు కూడా నగరం 'తీవ్ర' కాలుష్య విభాగంలోనే కొనసాగింది.

దట్టమైన పొగమంచు కారణంగా రోడ్లపై ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్రంగా స్పందించింది. ఆప్ ఢిల్లీ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ ఈ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ "ఇది అంతర్జాతీయంగా సిగ్గుచేటు. ఢిల్లీ సీఎం రాగానే మెస్సీ కోసం వచ్చిన జనం 'ఏక్యూఐ, ఏక్యూఐ' అని నినదించారు," అని విమర్శించారు. కాలుష్యంపై కేంద్రంలోని, ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ప్రధాని మౌనంగా ఉన్నారని ఆరోపించారు. అయితే, ఈ విమర్శలను సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు తమ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇది 27 ఏళ్ల సమస్య అని, దాన్ని పరిష్కరించేందుకు తమకు కనీసం 27 నెలల సమయం కావాలని కోరారు. గతంలో అధికారంలో ఉన్న ఆప్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏమీ చేయలేదని ఆమె ఆరోపించారు.

# నిస్వార్థ ప్రజాసేవకుడు పట్టాభి

రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం తలుపుతట్టినా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి పదవి గుమ్మం వరకు వచ్చినా సున్నితంగా తిరస్కరించి ప్రజాసేవలో, రాజకీయాల్లో మునిగిపోయిన మహనీయుడు డాక్టర్ పట్టాభి సీతారామయ్య. అంతే కాదు, నిరంతర ప్రజా క్షేమం గురించి ఆలోచించే పట్టాభి, ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఉద్యమానికి చేసిన కృషి మరిచిపోలేనిది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీకి సన్నిహితునిగా పట్టాభి సీతారామయ్య నిర్వహించిన పాత్ర మరవ లేనిది. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి సుభాష్ చంద్రబోస్‌కు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా, పట్టాభి పోటీలో పాల్గొని ఓటమి పాలైన సందర్భంగా పట్టాభి ఓటమి తన ఓటమిగా గాంధీజీ భావించి బాధపడ్డారంటే వారికున్న సాన్నిహిత్యం స్పష్టం అవుతున్నది. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర్య సమరయోధునిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకునిగా, తెలుగు భాషాభిమానిగా, ప్రత్యేక రాష్ట్ర సాధకునిగా, ఖద్దరు దారిగా, స్వాతంత్ర్య సమరశీలిగా, మహాత్మా గాంధీకి ఆప్తునిగా, రాజకీయ చతురునిగా, గవర్నర్ గా, నిరంతర ప్రజా సేవకునిగా, ముక్కుసూటి మనిషిగా ఆయన బహుముఖ శక్తిగా, వ్యక్తిగా సుపరిచితులు. పశ్చిమ గోదావరి జిల్లా గుండుకొలను గ్రామంలో 1880, నవంబర్ 24 న ఆరువేల నియోగి బ్రాహ్మణుల ఇంటిలో పట్టాభి జన్మించారు. ప్రాథమిక విద్య స్థానికంగా బందరులోనే చదివి ఉన్నత విద్యకై మద్రాసు (నేటి చెన్నై) వెళ్ళి మద్రాసు క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ. డిగ్రీ పొందిన పట్టాభి ఎం.బి.సి.ఎం. డిగ్రీ సాధించి డాక్టరు కావాలనే తన ఆశయాన్ని నెరవేర్చు కున్నారు. 1906లో మచిలీపట్నంలో వైద్యవృత్తిని చేపట్టారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, కాంగ్రెస్ నాయకుడిగా ఉంటూనే చదువు పూర్తి చేసిన తర్వాత మచిలీపట్నంలో డాక్టరుగా ప్రాక్టీసు పెట్టారు, కాని తన వృత్తి, ప్రవృత్తి అది కాదని ఎంచి, లాభదాయకమైన సంపాదనను వదులుకొని గాంధీజీచే ప్రభావితులై, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమములో పాల్గొన్నారు. అయితే గాంధీజీ పిలుపు మేరకు 1916 లో ఆ వృత్తిని వదిలి పెట్టడమే కాకుండా, భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ఎటువంటి వృత్తిని చేపట్ట కూడదనే ధ్యేయంతో ముందుకు సాగారు. సామాన్య ప్రజలకు బ్యాంకులు అందుబాటులో లేని రోజుల్లో, అప్పులకోసం అన్నదాతలు ఎదురు తెన్నులు చూస్తున్న రోజుల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నేడు దేశంలో ప్రముఖ బ్యాంకుగా చలామణి అవుతున్న ఆంధ్రాబ్యాంక్‌ను 1923లో స్థాపించారు. అంతేకాకుండా ఆయన స్థాపించిన ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెని (1925), హిందుస్తాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ కంపెని (1935) లు తరువాతి కాలంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో పట్టాభీ గాంధీజీకి అతి సన్నిహితంగా ఉండేవారు. 1939లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి అతివాద కాంగ్రెస్ అభ్యర్థి అయిన సుభాష్ చంద్రబోస్ కు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా, పట్టాభి పోటీలో పాల్గొని ఓటమి పాలైనారు. అయితే తమిళ ఆధిపత్యమున్న కొన్ని జిల్లాలను భావి తెలుగు రాష్ట్రములో కలపటానికి మద్దతు నిస్తున్నాడన్న భావన ఆయన ఓటమికి ప్రధాన కారణమయ్యింది. పట్టాభి ఓటమి తన ఓటమిగా గాంధీజీ భావించి బాధపడ్డారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభములో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ వర్గంలో పనిచేస్తూ ఉండగా మొత్తం కార్యాచరణ వర్గ సహితంగా పట్టాభిని అరెస్టు చేసి జైలు పాలు చేయగా, మూడేళ్లపాటు పట్టాభి తన దినచర్యను విస్తారమైన డైరీలో రాసుకున్నారు. దీనిని తదనంతరం ఫెదర్స్ అండ్ స్టోన్స్ (ఈకలు మరియు రాళ్ళు)గా ప్రచురించారు. 1948లో జైపూర్ కాంగ్రెస్ సమావేశం నాటికి కాంగ్రెస్ అధ్యక్షుని స్థాయికి ఎదిగారు. 1948లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో పురుషోత్తమ్‌దాస్ టాండన్ పై గెలిచి స్వతంత్ర భారత తొలి కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. 1952–57 మధ్యకాలంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవరించారు. రాష్ట్రం బయట పనిచేసిననూ తెలుగు భాషపై మమకారం కోల్పోలేదు. తను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎన్నో చిరస్మరణీయ సేవలను ఆయన చిత్తశుద్ధితో అందించారు. తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దాని కొరకు పట్టాభి ఎంతగానో కృషి చేశారు. పట్టాభి చొరవతోనే ఆంధ్ర రాష్ట్రోద్యమానికి అంకురార్పణ 1908లో బందరులో జరిగింది. బందరు సమావేశంలో తెలుగు జిల్లాల ప్రముఖులందరూ సమావేశమై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం గురించి చర్చించారు. ఆ తరువాతనే 1913లో బాపట్లలో తొలి ఆంధ్ర మహాసభ జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకత గురించి పట్టాభి ఆంగ్లంలో ఒక గ్రంథమే రచించారు. పట్టాభి కృషి వల్లనే 1920లో కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సూచన ప్రాయంగా ఆమోదించింది. పట్టాభి సీతారామయ్య ఎన్నో ఆర్థిక సంస్థలను స్థాపించారు. ఆంధ్రా బ్యాంకు (1923లో స్థాపన), ఆంధ్రా ఇన్స్యూరెన్స్ కంపెనీ, భారత లక్ష్మీ బ్యాంకు, కృష్ణా కో–ఆపరేటివ్ బ్యాంకు మొదలగు వాటి స్థాపనలో విశేష కృషి సల్పారు. ఆంధ్రాబ్యాంకు ద్వారా వ్యవసాయ దారులకు రుణాలిచ్చి వ్యవసాయాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. చిన్న మొత్తంలో డిపాజిట్లు సేకరించి పొదుపును అధికంగా ప్రోత్సహించారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసమే కాకుండా తెలుగు జిల్లాలలో తెలుగు వాడకాన్ని పట్టాభి ఎంతగానో ప్రోత్సహించారు. తాను స్థాపించిన సంస్థలన్నింటి లోనూ తప్పనిసరిగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లావాదేవీలు తెలుగులోనే జరగాలని నియమ నిబంధనలు పెట్టి ఆచరింప చేశారు. ఆయన వేష, భాషల్లో ఎప్పుడూ తెలుగుతనం ఉట్టిపడుతూ ఉండేది. అఖిల భారత కాంగ్రెస్ అయిననూ, గవర్నర్‌గా మధ్య ప్రదేశ్ వెళ్ళిననూ వేష, భాషల్లో మార్పు రాలేదు. పట్టాభి రచించిన గ్రంథాలలో కాంగ్రెస్ చరిత్ర అన్నింటికంటే ప్రధానమైనది. సుమారు 1600 పుటల కాంగ్రెస్ చరిత్రను కేవలం 2 మాసాలలో పూర్తిచేశారు. స్వాతంత్ర్యం తరువాత 1948లో తొలి జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టి, తరువాత 1952లో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై పార్లమెంటులో ప్రవేశించారు. 1952 నుండి 1957 వరకు మధ్య ప్రదేశ్ గవర్నరుగా పని చేశారు. తెలుగు ప్రజలకు ఎంతగానో తోడ్పాటు అందించిన పట్టాభి 1957, డిసెంబర్ 17న మరణించారు.

## పెన్షనర్ల మేధో నైపుణ్యం వృథా కారాదు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందించే నెలసరి పెన్షన్ ప్రభుత్వాల భిక్ష, దయ, బహుమానం లేదా ఎక్స్–గ్రేషియా కాదని నాటి సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వై. వి. చంద్రచూడ్ 17 డిసెంబర్ 1982 రోజున తీర్పు ఇవ్వడం పెన్షనర్లకా వరంగా, వారి గౌరవానికి నిదర్శనంగా నిలవడం జరిగింది. డి. ఎస్. నకారా కేసు విచారణ సందర్భంగా ఈ ప్రతిష్టాత్మక తీర్పును ఇవ్వడంతో ప్రతి ఏట 17 డిసెంబర్ రోజు భారత దేశవ్యాప్తంగా "పెన్షనర్ల దినోత్సవం" పాటించుట ఆనవాయితీగా మారింది. పెన్షన్లకు మైలురాయిగా నిలిచిన ఈ తీర్పులో పెన్షన్ అనేది గౌరవప్రద ఆర్థిక వెసులుబాటు మాత్రమే అని స్పష్టం చేయడం ముదావహం. పెన్షన్ సంస్కరణలను ఒక మలుపు తిప్పని ఈ సంచలన తీర్పు న్యాయమైన, సమ్మిళిత పెన్షన్ వ్యవస్థకు పునాది వేసినట్లు భావించాలి. పెన్షనర్ల గౌరవం, ఆర్థిక భద్రతలను నిసబెట్టిన ఈ సంచలన తీర్పును "పెన్షనర్ల మాగ్నా కార్టా" అని పిలుస్తున్నాం. పెన్షనర్ల హక్కులు, గౌరవం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన మార్గదర్శకుడు రక్షణ శాఖ నుంచి పదవి విరమణ పొందిన డి ఎస్ నకారాకు నివాళులను అర్పించడం మన కనీస బాధ్యత. 2025 పెన్షనర్ల దినోత్సవంలో భాగంగా "డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0" వంటి కార్యక్రమాలను నిర్వహించబడుతున్నాయి. జీవితంలో అతి ముఖ్యమైన ఉత్పాదకత చేయదగిన వయస్సును ప్రభుత్వ ప్రగతి కోసం వినియోగించే ఉద్యోగుల నిస్వార్థ సేవలకు ప్రతిగా విరమణ అనంతరం జీవిత చరమాంకంలో వారి కుటుంబ సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక స్థిరత్వం కలిగించడానికి ఈ గౌరవ వేతనం లేదా పెన్షన్ ఉపయోగపడుతున్నదని తెలుసుకోవాలి. పెన్షనర్లు ప్రభుత్వాలకు లేదా ప్రభుత్వ సంస్థలకు భారం అనిభావించడం మంచిది కాదని తెలుసుకోవాలి. పెన్షనర్ల అపార అనుభవం, నైపుణ్యాలు, కార్యదక్షత లాంటివి దేశాభివృద్ధికి సముచితంగా వినియోగించబడాలి. పెన్షనర్లు స్వచ్ఛంద కార్యకర్తలుగా అమూల్య సేవలను ఉచితంగా అందించడానికి సుముఖంగా ఉండడం హర్షదాయకం. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు, ఉద్యోగుల విధులను నిబద్ధతతో నిర్వహించడం, ప్రాజెక్టులు అమలు కావడం లాంటి సేవలకు తమ జీవితాలను అంకితం చేసి సరైన లబ్ధిదారులకు అందించిన ఉద్యోగులు నేటి తరం ఉద్యోగులకు మార్గదర్శనం చేయాలి. భారతదేశవ్యాప్తంగా దాదాపు 6.9 - 7.0 మిలియన్ల కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లను పొందుతున్నారు. భారతంలో మూడు రకాల పెన్షన్లు అమలు అవుతున్నాయి. ఉద్యోగులు పదవి విరమణ తర్వాత పొందే సాధారణ పెన్షన్, "ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆధారిత పెన్షన్", సంఘటిత రంగంలో "నేషనల్ సోసియల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్" ఆధారిత పెన్షన్ విధానాలు అమలు అవుతున్నాయి. ఉద్యోగి 33 ఏండ్ల సర్వీసు తర్వాత పదవి విరమణ చేస్తే వారి గత 36 నెలల సగటు జీతంలో 50 శాతం పెన్షన్ పొందేందుకు అర్హులు అవుతారు. 01 జనవరి 2004 తర్వాత ఉద్యోగం పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు "కాంట్రిబ్యూటరీ పెన్షన్" విధానం అమలు అవుతున్నది. ప్రభుత్వేతర రంగాల్లో కూడా ఈ నూతన పెన్షన్ విధానం 2009 నుంచి అమలులోకి వచ్చింది. ఫిబ్రవరి 2019 నుంచి అసంఘటిత శ్రామిక వర్గాలకు కూడా నెలకు రూ 3000/– పెన్షన్‌గా అందించడం జరుగుతున్నది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పెన్షనర్ల సమానత్వం, న్యాయం కోసం పాటు పడాల్సిన అవసరాన్ని ఈ వేదిక గుర్తు చేస్తుంది. సుప్రీమ్ కోర్టు తీర్పులో వివక్ష రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తూ, అర్హులైన వారందరికీ పెన్షన్ ప్రయోజనాలు సమానంగా అందించాలని నిర్ధారించింది. 2024లో ప్రవేశ పెట్టబడిన ఏకీకృత పెన్షన్ పథకం ద్వారా పెన్షన్ విధానాన్ని క్రమబద్ధీకరించడం, పెన్షనర్ల ఆర్థిక అవసరాలు తీర్చడం, అధిక భద్రత కల్పించడం, స్థిరత్వాన్ని నిర్ధారించడం లక్ష్యంగా కొనసాగుతున్నది. వృద్ధాప్యాన్ని అనుభవిస్తున్న పెన్షనర్లను జాతి సంపదగా భావించాలి. సమాజాభివృద్ధిలో వారి సేవలకు గుర్తింపు ఇవ్వాలి. పెన్షనర్ల ఆరోగ్యం, సంతోష సాధనకు చేయూత ఇవ్వాలి. పెన్షనర్లకు వైద్య సదుపాయాలు, ప్రయాణాలు, పన్ను రాయితీ, సంరక్షణ, సహాయ కేంద్రాలు, యాత్రలకు ప్రభుత్వాలు సహాయం చేయడానికి ప్రాధాన్యం ఉండాలి. నిన్నటి ప్రగతి రథాలను విస్మరించకుండా నేటి ప్రగతి రథ సునాయాస గమనాలకు కందెనగా పెన్షనర్ల సేవలను వాడుకోవాలి. వయోవృద్ధ పెన్షనర్లను గుండెల్లో పెట్టుకొని చూసుకోవాలి.

ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి

# ప్రజల వద్దకు పరిపాలన

- వేకువజామునే ప్రజలను కలిసిన రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాగూర్
- సమస్యలను వింటూ పరిష్కరించిన ఎమ్మెల్యే
- భవిష్యత్తుపై ప్రజలకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే.



**గోదావరిఖని:** రామగుండం కార్పొరేషన్ పరిధి గోదావరిఖని పట్టణం లోని పలు డివిజన్లలో మంగళవారం తెల్లవారుజామునే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పర్యటించారు. బైక్ పై వెళ్లి ప్రజలను కలిసి భవిష్యత్తుపై భరోసా కల్పించారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించిన ప్రజా పాలన నేపథ్యంలో ఇంటింటికి, గడపగడపకు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ప్రజల వద్దకు వెళ్లి వారు చెప్పే సమస్యలను సవినయంగా ఉంటూ పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని సిక్కుల వాడా, లక్ష్మీ నగర్, కళ్యాణ్ నగర్ పరిసర ప్రాంతాలలో బైక్ పై తిరుగుతూ ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ... మీ కుటుంబంలో ఒకడిగా ఉండే తనకు ఎప్పటికప్పుడు సమస్యలు వివరించాలని సూచించారు. అనంతరం వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇల్లు లేని వారికి ఇంటి సదుపాయాన్ని కల్పించడంతోపాటు ఆయా ప్రాంతాలలో డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్, మంచినీటికి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. అభివృద్ధి దిశగా వెళ్లే తనకు అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఎదుర్కొని ప్రజా శ్రేయస్సు ధ్యేయమని పేర్కొన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాత్కాలికంగా జరిగే కొన్ని ఇబ్బందులకు భవిష్యత్తులో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తున్నామన్నారు. అయితే ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులను కూడా సమీకరించామని అన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థిని పరామర్శించిన కేటీఆర్



**హైదరాబాద్** కాంగ్రెస్ నేతల దాడిలో తీవ్ర గాయాల పాలై యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గం, సోమార్పేట్ గ్రామానికి చెందిన (బీఆర్ఎస్ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన) బిట్ల బాలరాజు, ఆయన భార్య గంజి భారతి ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. అయనతో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ బాధితులకు ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## చలిమంట విషయంలో ఘర్షణ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య దాడి, ప్రతిదాడి
- పలువురికి గాయాలు

**వరంగల్** చలిమంట తెచ్చిన తంటా. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసుకున్నారు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెరువుకొమ్ తండాలో చోటుచేసుకుంది. సోమవారం అర్ధ రాత్రి చలి మంట విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం కర్రలు, రాళ్లతో ఇరు వర్గాల వారు దాడి చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలోఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు భారీగా మోహరించారు. గ్రామంలో బుధవారం పంచాయితి ఎన్నికలు జరుగనున్నాయి.

## జాతీయ ఉపాధి హామీ వేతనాల చెల్లింపులో జాప్యాలపై పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి ప్రశ్న



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాలపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. ప్రస్తుతం కూలీల వేతనాల కోసం ప్రత్యేక "గ్రీన్ చానల్" లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై ఆధారపడాల్సి వస్తోందని, దీని కారణంగా పేద గ్రామీణ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. కార్మికుల వేతన భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రక్రియల నుంచి వేరుచేసి, కేంద్ర ప్రభుత్వం నేరుగా కూలీల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని తీసుకురావాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నకు సమాధానంగా గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాశ్వాన్ మాట్లాడుతూ, ఇప్పటికే జాతీయ ఎలక్ట్రానిక్ నిధుల నిర్వహణ వ్యవస్థ ద్వారా కూలీల వేతనాలను కేంద్ర ప్రభుత్వం నేరుగా బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఈ విధానం ద్వారా మధ్యవర్తి దశలు తొలగిపోయి, వేతనాల చెల్లింపులో పారదర్శకతతో పాటు వేగం కూడా పెరిగిందని చెప్పారు. అలాగే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో భాగంగా ఆధార్ పేమెంట్ బ్రిడ్జ్ సిస్టమ్ అమలు చేస్తున్నామని, దీనివల్ల వివిధ కారణాల వల్ల జరిగే చెల్లింపుల తిరస్కరణలు గణనీయంగా తగ్గాయని వివరించారు. దేశవ్యాప్తంగా 2025 డిసెంబర్ 11 నాటికి 12.16 కోట్ల క్రియాశీల కూలీలలో 99.67 శాతం మందికి ఆధార్ సీడింగ్ పూర్తైందని, 99 శాతం మందికి పైగా కూలీలు నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో వేతనాలు పొందుతున్నారని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర స్థాయి పరిపాలనా జాప్యాల వల్ల కూలీలు నష్టపోకుండా ఉండేందుకు జాతీయ ఎలక్ట్రానిక్ నిధుల నిర్వహణ వ్యవస్థ ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తోందని, నిధులను వివిధ స్థాయిల్లో నిల్వ చేయకుండా నేరుగా కూలీలకు వేతనాలు చెల్లించడాన్ని ఈ వ్యవస్థ నిర్ధారిస్తోందని మంత్రి తెలిపారు.

# ప్రజల బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాలి

- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం - బోయినిపల్లి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాం
- బోయినిపల్లి గ్రామ సర్పంచ్ : నల్ల మోహన్ - ఉప సర్పంచ్ : మెరుపుల చందన - జలందర్
- ఎమ్మెల్యే కు నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ సన్మానం - గ్రామాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి గ్రామ నూతన సర్పంచ్ నల్ల మోహన్, ఉప సర్పంచ్ మెరుపుల చందన – జలంధర్ గౌడ్‌లు ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నేపథ్యంలో మంగళవారం చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించగా, బోయినిపల్లి గ్రామ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, బోయినిపల్లి గ్రామాభివృద్ధికి తమ పూర్తి సహకారం అందించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ"గ్రామ ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి అర్హుడికి చేరేలా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ప్రత్యేక చొరవ చూపాలి. బోయినిపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం నా వంతుగా అందిస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,గ్రామ వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# చెరువుకట్టపై అక్రమంగా చెట్లు నరికివేత

- లక్షల రూపాయలు ప్రభుత్వ ఆదాయాన్ని గండి





**ఓజిలి (ప్రశ్న న్యూస్)** ఓజిలి మండలంలోని జోషుల వారి కండ్రిగ చెరువు కట్టమీద ఇరువైపులా ఉన్న విలువైన చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొందరు వ్యక్తులు చెరువు కట్ట ఇరువైపుల పెరిగిన పచ్చని చెట్లను నరికేస్తున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున చెరువుకు ఇరువైపులా చెట్లు నరికివేతకు గురవుతున్నా ఇటు పంచాయతీ అధికారులతో పాటు అటు ఇరిగేషన్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎంతో ప్రజాధనం వెచ్చించి పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టం వచ్చినట్లు నరికేస్తున్నా కనీసం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికా రులు స్పందించి చెట్ల నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమి కులు కోరుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా లక్షల రూపాయలు విలువ చేసే చెట్లు నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చెట్లు నరికివేతకు గురవుతున్న విషయంపై ఎంపీడీవో, ఇరిగేషన్ శాఖ ఏఈ ను ఫోన్లో వివరణ కోరగా జోషుల వారి కండ్రిగ చెరువు సంబంధించి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అక్రమంగా చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుంటామని ఓజిలి ఎంపీడీవో నారాయణరెడ్డి , ఇరిగేషన్ శాఖ ఏఈ తెలిపారు.

# మూడవ విడత ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్








**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అలూర్, ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్ఓలకు సూచించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ కలెక్టర్ తో కలిసి అలూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించారు. అలాగే, నందిపేట, డొంకేశ్వర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సైతం సందర్శించి పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును పరిశీలించారు.

### మూడవ విడత పోలింగ్ వివరాలు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్లోని ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీమ్గల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలో గల గ్రామాలలో...

పోలింగ్ తేదీ 17.12.2025 సమయం ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు మొత్తం సర్పంచ్ స్థానాలు 165, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ స్థానాలు 19, ఎన్నికలు జరుగనున్న సర్పంచ్ స్థానాలు 146, పోటీలో ఉన్న అభ్యర్థులు 562, మొత్తం వార్డు స్థానాలు 1620,

నామినేషన్లు దాఖలు కాని వార్డు స్థానాలు 0, ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు స్థానాలు 490, ఎన్నికలు జరుగనున్న వార్డు స్థానాలు 1130, అభ్యర్థులు 3382, ఓటర్ల సంఖ్య 3,06,795, పోలింగ్ కేంద్రాలు 1490, ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గం. నుంచి ప్రారంభం పీవోలు 1490, ఓపీవోలు 2278,సిబ్బంది తరలింపునకు రూట్లు 38,మైక్రో అబ్జర్వర్లు 58, జోనల్ అధికారులు 38, వెబ్ క్యాస్టింగ్ పోలింగ్ కేంద్రాలు 51

### ఏర్పాట్లను పరిశీలించిన ఎలక్షన్ అబ్జర్వర్


గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు జీ.వీ.శ్యాంప్రసాద్ లాల్ మంగళవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, తుది విడత ఓటింగ్ నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏర్గట్ల, కమ్మర్పల్లి, మోర్తాడ్, వేల్పూర్, భీమ్గల్ తదితర చోట్ల పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, బుధవారం నాటి పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను గమనించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఆదర్శంగా నిజామాబాద్ నీ తీర్చిదిద్దాలి



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే ఇటీవల టి యు ఎఫ్ ఐ డి సి ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించేందుకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సుభాష్ నగర్ లోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ నగరంలోని రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, టి యు ఎఫ్ ఐ డి సి ద్వారా చేపడుతున్న పనుల నాణ్యత, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దే బాధ్యత నియోజకవర్గానికి చెందిన ప్రతి ఒక్క అధికారి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా తన నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు . ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, సుదర్శన్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ డి ఈ ప్రవీణ్, పబ్లిక్ హెల్త్ అధికారి డి ఈ నాగేశ్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ అధికారి ఏఈ శివకృష్ణ తదితర మున్సిపల్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేణు స్వామి అలాంటి వాడని అనుకోలేదు



విష్ణు ప్రియ యాంకర్‌గా మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా సుడిగాలి సుధీర్‌తో కలిసి చేసి 'పోవే పోరా' గేమ్ షో పాపులారిటీని తెచ్చిపెట్టింది. యాంకర్‌గానూ కాకుండా.. నటిగా పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ నటించి మెప్పించింది. ఇక రియాలిటీ షో బిగ్‌బాస్ లోనూ పాల్గొని మంచి ఫేమ్ సంపాదించుకుంది. తాజాగా, ఓ షోలో పాల్గొన్న విష్ణు ప్రియ తన జీవితంలో జరిగిన పలు సంఘటనలు పంచుకుంది. తన మార్ఫింగ్ వీడియోల వల్ల చాలా అవమానాలు ఎదుర్కొన్నట్లు తెలుపుతూ ఎమోషనల్ అయింది. ఆ బాధను తట్టుకోలేక ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకున్నట్లు తెలిపింది. అంతేకాకుండా కష్టసమయంలో.. వేణు స్వామి తనను ఆదుకున్నారని చెప్తూ ప్రశంసలు కురిపించింది. గత కొద్ది రోజులుగా ఆయనపై విమర్శలు వస్తున్నా.. తనకు చేసిన సాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పింది. తన తల్లి చనిపోయే సమయంలో.. హాస్పిటల్ బిల్లులు లక్షల్లో కట్టాల్సి ఉండగా.. అప్పుడు ఎవరికి ఫోన్ చేయాలో తెలియని పరిస్థితుల్లో వేణు స్వామిని చేశానని. వెంటనే ఆయన తనకు సాయం అందించారని తెలిపింది. ఆయన వల్లే డాక్టర్లు మూడు రోజులే బతుకుతుందని చెప్పిన తన తల్లి మరో ఏడాది పాటు బతికిందని చెప్పి ఎమోషనల్ అయింది. నిజంగా ఆయన అంత సాయం చేస్తారని అనుకోలేదు. ఎవరికైనా అవసరం వస్తే ముందుగా వచ్చి సహాయం చేసే మంచి మనిషి వేణు స్వామి అని పొగిడేసింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండగా.. అది గమనించిన నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు షాక్ అవుతున్నారు. పూజలే చేయడమే కాదు.. సాయం కూడా చేస్తారా? అని అంటున్నారు.

## విడుదలకు సిద్ధమైన 'ఎర్ర చీర'



బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఎర్రచీర'. ఈ సినిమాలో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని కనిపించనుంది. 'ఎర్రచీర' మూవీకి సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్ర పోషించారు. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. అయితే ఈ సినిమాలో హారర్ సన్నివేశాలు ఎక్కువ ఉన్న కారణంగా ఈ సినిమా చూసిన సెన్సార్ వారు సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ మూవీ ముఖ్యంగా 18 సంవత్సరాల లోపు పిల్లలు చూడటానికి అనుమతి లేదు.

అలాగే హార్ట్ పేషెంట్స్ ఈ సినిమానికి చూడటానికి వచ్చినప్పుడు మాత్రం తగు జాగ్రత్తలు తీసుకుని రావలసిందిగా చిత్ర దర్శకుడు సుమన్ బాబు తెలిపారు. తాజాగా, మూవీ మేకర్స్ విడుదల తేదీ ప్రకటించారు. ఈ సందర్భంగా.. నిర్మాత సుబ్బారెడ్డి మాట్లాడుతూ..”సినిమా కంటెంట్ డివోషనల్ టచ్ ఉన్న 'ఎర్రచీర'ను ఫిబ్రవరి 6వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. క్లైమాక్స్ హైలైట్‌గా నిలుస్తుంది” అన్నారు. అలాగే సుమన్ బాబు మాట్లాడుతూ “కొన్ని సినిమాల్లోని సోల్ మనం అనుభూతి చెందాలంటే, ఖచ్చితంగా థియేటర్‌లోనే చూడాలి. మా 'ఎర్ర చీర' మూవీ కూడా అలాంటిదే. సౌండింగ్, విజువలైజేషన్ అనుభూతి మీకు తెలియాలంటే ఖచ్చితంగా థియేటర్‌లోనే చూడాలని అన్నారు.



## సినిమా ఛాన్స్ ఇస్తానని..

సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగిన కొద్ది, చాలా మంది పాపులర్ అవుతున్నారు. చిన్నచిన్న వీడియోలు పెట్టి, పెద్ద స్టార్లు అయిన వాళ్లు కూడా ఉన్నారు. అయితే అలాంటి వారిలో సుష్మ భూపతి అనే లేడీ కూడా ఉన్నారు. ఈమె సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం ఎనిమిది లక్షలకు పైగా ఫాలోవర్స్ సంపాదించుకున్న ఈమె, ప్రమోషన్స్ కూడా విపరీతంగా చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఈమె డాన్స్ వీడియోలు చేస్తూ యూత్ ను ఆకట్టుకుంటోంది. దానికి తగ్గట్టుగానే సుష్మ ఇన్ స్టాగ్రామ్ ఆదాయం భారీగానే పెరిగింది. నెలకు దాదాపు లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కూడా పేర్కొంది. అయితే సోషల్ మీడియాలో విపరీతంగా ఫాలోయింగ్ సంపాదించుకున్న సుష్మ భూపతికి ఇటీవల ఓ సినిమా ఆఫర్ కూడా వచ్చిందట. మూవీ ఛాన్స్ ఇస్తా కానీ, కమిట్మెంట్ కావాలంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడట. అయితే ఆ సమయంలో తన భర్త ముందే, ఫోన్ లౌడ్ స్పీకర్ పెట్టి సారీ సార్, నేను అలాంటి దాన్ని కాదు అని చెప్పినట్లు సుష్మా భూపతి తాజాగా వెల్లడించారు. ఇప్పుడు ఈ న్యూస్ వైరల్ గా మారింది. తన భర్త సపోర్టుతో ఇంత పాపులారిటీ సంపాదించుకున్నానని ప్రతి ఇంటర్వ్యూలో సుష్మ భూపతి పేర్కొంటున్న సంగతి తెలిసిందే.

## చాలా రోజుల తర్వాత ఎక్సైటింగ్ ప్రాజెక్టుతో వస్తున్నా..

బాబీ సింహా, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్‌గా మెహర్ యరమతి దర్శకత్వంలో ఓ కొత్త చిత్రం రూపొందుతోంది. యువ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యువ కృష్ణ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి ఎస్కేఎన్ క్లాప్ కొట్టారు. వంశీ నందిపాటి కెమరా స్విచాన్ చేశారు. తనికెళ్ళ భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించారు. ఈసందర్భంగా.. నిర్మాత యువకృష్ణ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం చాలా కథలు విన్నాను. నటనకి చాలా మంచి స్కోప్ ఉన్న కథ, ఈ కథ వినగానే మొదట నాకు బాబీ సింహ గారే గుర్తొచ్చారు. ఆయన్ని సంప్రదిస్తే అప్పుడు ఆయన చాలా బిజీగా ఉన్నారు. కథ ఆయనకు చాలా నచ్చింది. వెంటనే చేద్దామని ఆయన చెప్పడం మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. నిర్మాతగా ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా, కథకు కావలసింది ప్రతిదీ సమకూర్చి ఒక అద్భుతమైన సినిమాతో మీ ముందుకు రాబోతున్నామని అన్నారు. హెబ్బా పటేల్ మాట్లాడుతూ.. చాలా రోజుల తర్వాత నాకు మంచి ఎక్సైటింగ్ ప్రాజెక్టు వచ్చింది. సూర్యతో కలిసి పని చేయడం ఇది రెండోసారి. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్యు. బాబీ సింహ గారితో కలిసి నటించడం ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరిని




అలరిస్తుందని చెప్పింది. అనంతరం హీరో బాబీ సింహ మాట్లాడుతూ.. వాల్తేరు వీరయ్య తర్వాత మళ్లీ మీ అందరిని కలవడం చాలా ఆనందంగా ఉంది. తెలుగులో హీరోగా ఒక సినిమా చేయాలనుకున్నప్పుడు చాలా కథలు విన్నాను. ఒక మంచి కథ కోసం ఎదురుచూస్తున్న సమయంలో యువ దగ్గరినుంచి కాల్ వచ్చింది స్క్రిప్ట్ విన్న తర్వాత చాలా నచ్చింది. ఒక యాక్టర్‌ని ఛాలెంజ్ చేసే స్క్రిప్ట్ ఇది. నా కెరియర్‌లో ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. హెబ్బా ఎక్సలెంట్ పెర్ఫార్మర్. తనతో వర్క్ చేయడం కూడా నాకు చాలా ఆనందంగా ఉంది. డిసెంబర్ 22 నుంచి వైజాగ్ లో షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నాం. మీ అందరి బ్లెస్సింగ్స్‌ను కోరారు.

## నాకు చాలా శక్తివంతమైన పాత్ర లభించింది




కోలీవుడ్ స్టార్ అరుణ్ విజయ్ ఓ వైపు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటిస్తూనే మరోవైపు హీరోగా వరుస చిత్రాలు చేస్తున్నాడు. ఆయన నటిస్తున్న సినిమాల్లో 'రెట్టతల' ఒకటి. తిరుకుమరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తాన్య రవిచంద్రన్, యోగేష్, జాన్ విజయ్, హరీష్ పెరాడిచ బాలాజీ మురుగదాస్, కీలక పాత్రలో కనిపించనుంది. భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుండగా.. ఇందులో అరుణ్ విజయ్ ద్విపాత్రాభినయం చేయడం విశేషం. ఈ సినిమాలో సిద్ధి ఇద్నాని హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న 'రెట్టతల' డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈక్రమంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన సిద్ధి ఇద్నాని ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. “నా మొదటి సినిమా 'వెందు తనిందతు కాడు' తర్వాత నేను కొంచెం రిలాక్స్ అయ్యాను. కానీ ఈ పరిశ్రమలో మనం ఎప్పుడూ మరింత సాధించాలనే తపనతో ఉండాలి. ఈ సినిమాలో నాకు చాలా శక్తివంతమైన పాత్ర లభించింది. నేను కేవలం వచ్చి డ్యాన్స్ చేసి వెళ్ళిపోవాలనుకోవడం లేదు. ఒక మహిళా పాత్ర ప్రాముఖ్యతను నిరూపించాలనుకుంటున్నాను. ఈ సినిమాలో ఆండ్రి అనేది నా పాత్ర పేరు, ఇది చాలా బలమైన పాత్ర, ఇది సినిమా కథను కూడా ముందుకు నడిపిస్తుంది. నేను కేవలం పేరుకే హీరోయిన్ పాత్రలు చేయాలనుకోవడం లేదు, నేను ఎప్పుడూ పాత్రకు ఒక ఉద్దేశం ఉండాలని కోరుకుంటాను. నన్ను ఇందులో భాగం చేసిన 'రెట్ట తల' టీమ్ అందరికీ ధన్యవాదాలు.

## మంచి అనుభూతినిచ్చే 'దండోరా'



'కలర్ ఫొటో', 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందించిన తాజా చిత్రం 'దండోరా'. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రం ఈనెల 25న భారీ ఎత్తున విడుదల కాబోతోంది. ఈ క్రమంలో దర్శకుడు మురళీకాంత్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. సమాజంలోని అసమానతల మీద కథ చెప్పాలనే ఉద్దేశంతో ఈ సినిమా తీశాను. చనిపోయిన వ్యక్తుల్ని పూడ్చేందుకు కమ్యూనిటీ వైజ్‌గా, రిలీజియస్ వైజ్‌గా కొంత మందికి భూమిని కేటాయిస్తారని నాకు అంతగా తెలీదు. నాకు ఎదురైన ఓ అనుభవంతో ఈ కథను రాసుకున్నాను. 'బలగం'లో వ్యక్తి చనిపోయిన తరువాత జరిగే పిండ ప్రధానం చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రంలో వ్యక్తి చనిపోయిన తరువాత నుంచి పూడ్చి పెట్టే వరకు జరుగుతుంది. క్రిమేషన్‌తో ఈ చిత్రం ఎండ్ కార్డ్ పడుతుంది. ఓ వ్యక్తిని ఎందుకు పూడ్చనివ్వడం లేదు? ఆ ఊరి సమస్య ఏంటి? సమస్యకు పరిష్కారం దొరికిందా? లేదా అన్నదే కథ. ఇందులో అన్ని పాత్రలు శివాజీ కారెక్టర్‌కు లింక్ అయి ఉంటాయి. బిందు మాధవి పాత్ర చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. వెరీ స్ట్రాంగ్ ఉమెన్ పాత్ర. ఈ చిత్రంలో నిర్ణయాలన్నీ మహిళ పాత్రలే తీసుకుంటాయి. మార్క్ కె రాబిన్‌మ్యూజిక్, ఆర్‌ఆర్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ చిత్రంలో ఆర్‌ఆర్ అందరినీ కదిలిస్తుంది. ఈ సినిమా, దీనిలోని స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. ఓ అందమైన మంచి అనుభూతితో థియేటర్ నుంచి ప్రేక్షకులు బయటకు వస్తారు.

## రణ్‌వీర్ వివాదాస్పద కామెంట్స్‌పై ఎట్టకేలకు స్పందించిన రిషబ్ శెట్టి!



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా 'కాంతార: చాప్టర్1' పై పలు కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. గోవాలో జరిగిన ఇఫ్ఫీ వేడుకలో.. పంజుర్లీ దేవతపై తీసిన పలు సీన్లను ఇమిటేట్ చేసి వివాదంలో చిక్కుకున్నాడు. దీనిపై తీవ్రమైన వ్యతిరేకత రావడంతో పాటు నెటిజన్లు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో రణ్‌వీర్ సింగ్ తన ఉద్దేశాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారని క్షమాపణలు చెప్పాడు. అయితే ఇదే ఈవెంట్‌లో ఉన్న రిషబ్ శెట్టి మాత్రం సైలెంట్‌గా ఉండిపోయారు. ఆ తర్వాత కూడా రణ్‌వీర్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై స్పందించకపోవడం గమనార్హం. ఇన్ని రోజుల తర్వాత ఈ విషయంపై రిషబ్ శెట్టి రియాక్ట్ అయ్యారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. “కాంతారలాంటి సినిమా తీసేటప్పుడు సంస్కృతి, సంప్రదాయాలు పాప్ కల్చర్‌గా మారిపోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఇక చిత్ర నిర్మాతగా నేను ప్రతిదీ గౌరవప్రదంగా చిత్రీకరించాలి. వాటిని నిర్ధారించడానికి చాలా మంది పెద్దల మార్గదర్శకత్వం తీసుకున్నా. దేవతలపై మిమిక్రీ చేయడం నాకు కూడా అసౌకర్యాన్ని కలిగించింది. సినిమాలో చాలా భాగం సినిమాటిక్, నటనకు సంబంధించింది. అయినా కూడా దైవం అనేది సున్నితమైన అంశం. ఎక్కడికి వెళ్లినా, వేదికలపై దేవతలను అపహాస్యం చేయొద్దని నేను కోరుతున్నా. ఎందుకంటే ఇది భావోద్వేగాలతో ముడిపడిన విషయం” అని అన్నారు. ఇక ఈ కామెంట్స్ ఆయన రణ్‌వీర్‌ను ఉద్దేశించి అని అంతా చర్చించుకుంటున్నారు.

## రెండోసారి సర్పంచిగా గెలుపొందిన ఏ.టి. యాదవ్‌కు ఘన సన్మానం - శుభాకాంక్షలు





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** శాబాష్‌పల్లి గ్రామ సర్పంచిగా రెండోసారి భారీ మెజారిటీతో గెలుపొందిన ఏ.టి. యాదవ్‌ను మంగళవారం హైదరాబాదులోని సచివాలయంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు తినిపించారు.అనంతరం సికింద్రాబాద్ మాజీ పార్లమెంటు సభ్యుడు అంజన్ కుమార్ యాదవ్ కూడా ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో వేర్వేరుగా ఏ.టి. యాదవ్‌ను శాలువాలతో సన్మానించి, గెలుపుపై అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా వారి వెంట బోయినిపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ ఉన్నారు.

# విలీనానంతరం దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్‌ఎంసీ

- 2,060 చదరపు కిలోమీటర్లకు పెరగనున్న విస్తీర్ణం
- 1.12 కోట్ల నుంచి 1.34 కోట్లకు పెరగనున్న జనాభా
- రెట్టింపు కానున్న కార్పొరేషన్ వార్డుల సంఖ్య




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) చరిత్రలో ఒక భారీ మార్పు చోటు చేసుకుంటోంది. నగర విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడంతో.. పరిపాలన సౌలభ్యం కోసం చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ కీలక వివరాలను వెల్లడించారు. ఈ విభజన కేవలం ప్రస్తుత అవసరాల కోసమే కాకుండా భవిష్యత్తులో పెరగబోయే జనాభాను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అంటే ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఇలా వేర్వేరు పాలనా వ్యవస్థలు ఉండేవి. అయితే ఇప్పుడు వాటన్నింటినీ కలిపి ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో జీహెచ్‌ఎంసీ పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుండి 2060 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. సుమారు 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేశారు. దీని వల్లనే వార్డుల పెంపు జరిగిందన్నారు. దీంతో దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన కార్పొరేషన్‌గా హైదరాబాద్ అవతరించింది. అందుకే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో వార్డుల హద్దులను నిర్ణయించారు.వార్డుల పునర్విభజన కేవలం అంకెలకు పరిమితం కాకుండా భౌగోళిక పరిస్థితులను బట్టి చేశామన్నారు. రైల్వే లైన్లు, ప్రధాన రహదారులు, నాలాలను హద్దులుగా తీసుకున్నట్లు తెలిపారు. గతంలో కొన్ని వార్డులు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉండేవి. ఇప్పుడు అటువంటి సమస్య లేకుండా ఒకే నియోజకవర్గ పరిధిలోకి వచ్చేలా జాగ్రత్త పడ్డారు. ఉదాహరణకు తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం జనాభా తక్కువగా ఉన్నా రాబోయే ఐదేళ్లలో అక్కడ భారీ అపార్ట్‌మెంట్లు, కట్టడాల వల్ల జనాభా 4 లక్షలు దాటే అవకాశం ఉంది. అందుకే అటువంటి చోట్ల వార్డుల సంఖ్యను పెంచారు. వార్డుల విభజనపై వచ్చిన ప్రతీ అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. వార్డుల పేర్లు మార్చాలని, అలాగే కొన్ని ప్రాంతాల్లో సరిహద్దులపై అభ్యంతరాలు ఎక్కువగా వచ్చాయి. లిఖితపూర్వక అభ్యంతరాలు సమర్పించడానికి రేపు ఆఖరి రోజన్నారు. నగర విస్తీర్ణం పెరగడంతో చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ ఎమ్మెల్యేలను కూడా కౌన్సిల్ సమావేశాలకు ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిసెంబర్ చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తే, రాబోయే జనగణన సమయానికి స్పష్టమైన గణాంకాలు అందుబాటులో ఉంటాయి. ఈ భారీ కసరత్తుతో హైదరాబాద్ నగరం మరింత పకడ్బందీగా అభివృద్ధి చెందుతుందని అధికారులు భావిస్తున్నారు.

## చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ను కలిసిన దుండ్రపల్లి సర్పంచ్ జంగం అంజయ్య



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని దుండ్రపల్లి గ్రామ సర్పంచిగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన జంగం అంజయ్య మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, గ్రామ సర్పంచ్‌గా జంగం అంజయ్య గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం సర్పంచ్ జంగం అంజయ్య మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ, ఎమ్మెల్యే సహకారంతో దుండ్రపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ఆ కానిస్టేబుల్ ఉద్యోగంతోనే మా నాన్న మాకు జీవితాన్నిచ్చారు

- కొత్త కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- కానిస్టేబుల్‌గా మొదలైన తన తండ్రి ప్రస్థానమే తనకు స్ఫూర్తి అని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలో పెరిగిన గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలను అరికట్టాలని పిలుపు



అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం ప్రజల మానప్రాణాల సంరక్షణకు, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యంగా మహిళల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కొత్తగా ఎంపికైన 6,100 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు పవన్ కూడా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి తరతమ భేదాలకు తావుండదని, కొత్త కానిస్టేబుళ్లు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పవన్ తన తండ్రిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. "నా తండ్రి కూడా కానిస్టేబుల్‌గానే ఉద్యోగ జీవితం ప్రారంభించారు. పనిలో నిబద్ధత, ఎదగాలన్న బలమైన కాంక్షతో ప్రమోషన్లు పొంది ఏఎస్ఐ స్థాయికి చేరుకున్నారు. ఆ కానిస్టేబుల్ ఉద్యోగంతోనే మాకు జీవితాన్నిచ్చారు, చదివించారు. ఆయన విలువలతో కూడిన ప్రస్థానమే మాకు స్ఫూర్తి. మీలా ఒక కానిస్టేబుల్‌గా ప్రారంభమైన మా నాన్నగారు ఇచ్చిన స్ఫూర్తే నన్ను ఈరోజు మీ ముందు నిలబెట్టింది" అని తెలిపారు. కానిస్టేబుళ్లే పోలీస్ శాఖకు మూల స్తంభాలని, వారి ధైర్యమే శాఖకు జీవమని కొనియాడారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి శాంతిభద్రతలతోనే ముడిపడి ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. "ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తమ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు రావడానికి పటిష్ఠమైన శాంతిభద్రతలే కారణమని చెప్పారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు గారు చెప్పేది కూడా ఇదే. శాంతిభద్రతలు కల్పించడంలో మీరే కీలక పాత్ర పోషించాలి" అని సూచించారు. పోలీసులు ధరించే ఖాకీ చొక్కా సమాజానికి రక్షణ కవచం లాంటిదని, దాని గౌరవాన్ని కాపాడాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని పవన్ విమర్శించారు. క్రికెట్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్ వంటివి గ్రామ స్థాయికి చేరాయని, సైబర్ మోసాలు పెరిగిపోయి అమాయకులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటిత నేరాల నియంత్రణపై కొత్త కానిస్టేబుళ్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల కొన్ని తీవ్రవాద జాడలు కూడా బయటపడుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. 2022లో నోటిఫికేషన్ ఇచ్చి, న్యాయపరమైన చిక్కులు వస్తే గత ప్రభుత్వం పట్టించుకోలేదని, దీనివల్ల అర్హత సాధించిన అభ్యర్థులు మూడేళ్ల విలువైన సమయాన్ని కోల్పోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, హోంమంత్రి వంగలపూడి అనిత పట్టుదలతో న్యాయపరమైన అడ్డంకులను తొలగించి, నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేశామని తెలిపారు. "మీరు ప్రజలకు అండగా ఉండండి, మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. ఈసారి ఎంపికైన వారిలో 4051 మంది ఉన్నత విద్యావంతులు, 810 మంది సాంకేతిక కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారని, వారి నైపుణ్యాన్ని సైబర్ నేరాల నియంత్రణకు ఉపయోగించాలని సూచించారు. ఎంపికైన 5,757 మందిలో 1,062 మంది మహిళలు ఉండటం సంతోషకరమని అన్నారు. ఈ నెల 22 నుంచి వీరికి 9 నెలల పాటు కఠిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## సర్పంచ్ ఎన్నికల్లో పయనిస్తున్న కాంగ్రెస్ వేవ్‌స్

- సర్పంచ్ ఎన్నికల్లో 75 శాతం స్థానాల్లో జయభేరి
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో బలంగా నిలిచిందని, సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తెలిపారు.నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం ధర్మారం గ్రామంలోని అమృత గార్డెన్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన ఏడు మండలాల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచులు, వార్డు మెంబర్లను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 153 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగగా, వాటిలో 120 గ్రామాల్లో (75 శాతం) కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి కేవలం 20 సీట్లు మాత్రమే దక్కాయని, బీజేపీకి ఐదు సీట్లు వచ్చాయని పేర్కొన్నారు. మిగతా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటాపోటీగా పోరాడి స్వల్ప తేడాతో ఓటమి చెందారని వివరించారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, అదే కారణంగా ఓటింగ్ శాతం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా 80 శాతం వరకు నమోదైందని తెలిపారు. ప్రజా సంక్షేమం పట్ల ఆసక్తి లేని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే శక్తి లేదని విమర్శించారు.రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ప్రజల వద్దకు నేరుగా పాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజలు మరింత మద్దతు తెలుపుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, ఐసీడీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు అమృతాపూర్ గంగాధర్, మాజీ ధర్పల్లి ఎంపీపీ ఇమ్మడి గోపి, నిజామాబాద్ రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ పొలాసాని, మాజీ డిచ్పల్లి ఎంపీపీ కంచెట్టి గంగాధర్, డీసీసీ కార్యదర్శి ధర్మ గౌడ్, గుడి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధనుర్మాసమంటే శూన్య మాసమా?

- శుభకార్యాలు చేయకూడదా.?
- ధనుర్మాసంలో శుభకార్యాలు ఎందుకు చేయరో తెలుసా.?

కార్తీక మాసం, మాఘమాసం, శ్రావణ మాసాలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యత ఉందని చాలా మంది భావిస్తారు. కానీ ధనుర్మాసం కూడా చాలా ఆధ్యాత్మిక ప్రయోజనాలు కలిగిన నెల. ఈ నెలకు చాలా ప్రత్యేకత ఉంది. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించాక ఏర్పడే ధనుర్మాసం ఎంతో విశిష్టమైనది. ఈ కథనంలో ధనుర్మాసానికి ఎందుకంతటి విశిష్ట వచ్చింది? ఈ మాసంలో శుభకార్యాలు చేయవచ్చా? ఈ మాసానికి శూన్య మాసమని ఎందుకు పేరు వచ్చింది? తదితర వివరాలను తెలుసుకుందాం.

### ధనుర్మాసం అంటే.?

డిసెంబర్ 15వ తేదీ ఆదివారం సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశిస్తాడు కాబట్టి డిసెంబర్ 16వ తేదీ నుంచి ధనుర్మాసం మొదలవుతుంది. ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం ఇల్లు శుభ్రం చేసి, దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మి కరుణా, కటాక్షాలు సిద్ధిస్తాయని శాస్త్రవచనం. తెలుగు రాష్ట్రాలలో ఈ మాసాన్ని పండుగ నెల అని అంటారు.

### విష్ణు పూజ - బాలభోగం..

ధనుర్మాసం విష్ణు పూజకు చాలా ప్రత్యేకమైనది. తిరుమలలో ధనుర్మాసం నెలరోజులు సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. విష్ణు ఆలయాలలో ఉదయం అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. ఇలా చేయడాన్ని బాలభోగం అంటారు. అలాగే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ ముహూర్తం లాంటిది. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకు అంటే భోగి రోజు వరకు ధనుర్మాసం కొనసాగుతుంది. ఈ నెల రోజులు విష్ణు ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ధనుర్మాసంలో స్నాన, దాన, హోమ, వ్రత పూజలు చేయడం చాలా మంచిది.

### ధనుర్మాసానికి ఎందుకంత విశిష్టత.?

దేవాలయాల్లో జరిగే ఆగమ శాస్త్ర కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్రదాయాలు కలిసిన అంశాలలో ధనుర్మాసం ఒకటి. నిజానికి ఆండాళ్ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కళ్యాణం మొదలైనవి ద్రావిడ దేశ సంప్రదాయమని పెద్దలు తెలియజేశారు. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసమని అర్థం. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. దేవాలయాల్లో ఆండాళమ్మ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కళ్యాణం, పొంగల్ ప్రసాదాలు మొదలైనవి ధనుర్మాసంలోనే నిర్వహిస్తారు.

### దారిద్ర్యాన్ని దూరం చేసే లక్ష్మీ పూజ

ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో దరిద్రం దూరమవుతుందని విశ్వాసం.

### ముగ్గులు - గొబ్బెమ్మలు..

ధనుర్మాసంలో ప్రతి ఇంటి ముందు వేకువఝామున ఇంటి ముందు అందమైన ముగ్గులు వేసి ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు, గుమ్మడి పూలు ఉంచి వాటిని బియ్యం పిండి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజిస్తారు. లక్ష్మీ రూపంలో ఉన్న గొబ్బెమ్మలను పూజించడం వల్ల మంచి జరుగుతుంది.

### ధనుర్మాస వ్రతం - మార్గళి..

ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతం గురించి బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి. ఈ ధనుర్మాసంలోనే గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది.



### కల్యాణ ప్రాప్తి..

ధనుర్మాసంలో వివాహం కావాల్సిన అమ్మాయిలు ప్రతిరోజు సూర్యోదయానికి ముందే స్నానాలు చేసి పంచామృతాలతో మహావిష్ణువును అభిషేకించి, తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి. నెలరోజులూ చేయలేని వాళ్ళు 15 రోజులు, 8 రోజులు లేదా ఒక్క రోజైనా చేయవచ్చు. ఇలా చేయడం వలన వారికి కోరుకున్న వ్యక్తితో అతి త్వరలో వివాహం జరుగుతుందని ప్రతీతి.

### ధనుర్మాసంలో శుభకార్యాలు ఎందుకు చేయరు.?

ఏడాది పొడవునా నిత్య దైనందిన కార్యక్రమాలతో ఉంటూ భగవంతుని కోసం సమయం కేటాయించలేని వారి కోసమే ఈ ధనుర్మాసం. అందుకే ఈ నెలలో ఎలాంటి శుభకార్యాలు చేయరు. శుభకార్యాలు ఉండవు కాబట్టి ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. ఎందుకంటే రవి ధనస్సు రాశిలోకి ప్రవేశించి మకరంలోకి వెళ్ళే సమయమే ధనుర్మాసం. ధనుస్సు, మీనంలో రవి ఉన్నప్పుడు, సూర్యుని రాశి అయిన బృహస్పతిలో ఉన్నప్పుడు ఏ శుభకార్యాన్ని నిర్వహించకూడదు. కేవలం పండుగ వాతావరణంతో అంతా సంతోషంగా, ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఈ మాసంలో ఎక్కువగా సూర్య నమస్కారాలు చేస్తారు. ఇంకా విష్ణుమూర్తిని నిత్యం వేకువనే పూజించడం శుభం.ఇంతటి విశిష్టమైన ధనుర్మాసాన్ని విష్ణు పూజకు వినియోగించి సద్వినియోగం చేసుకుందాం. జై శ్రీమన్నారాయణ!

**సీనియర్ జర్నలిస్ట్ వెంకయోగి రఘురామ్.**

# ముషీరాబాద్ అడ్డా అక్రమ నిర్మాణాల గడ్డ

## టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమ సంపాదనకు అంతు లేదా.?

- ఫోన్ చేస్తే సమాధానం చెప్పని టౌన్ ప్లానింగ్ ఏసిపి దేవేందర్
- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోని సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య
- ముషీరాబాద్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలు
- డిప్యూటీ కమిషనర్ కు ఫోన్ చేయాలంటే తిడతాడని జంకుతున్న ప్రజలు
- ముషీరాబాద్ సర్కిల్లో అవినీతి పాలనను అడ్డుకునేది ఎవరు.?





ముషీరాబాద్( ప్రశ్న న్యూస్) మున్సిపల్ అధికారులు అంటేనే అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కి మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాం మమ్ములను ప్రశ్నించే దమ్ము ధైర్యం ఉన్నత అధికారులకు లేదు అన్నట్లుగా ఉంది ముషీరాబాద్ సర్కిల్ అధికారుల వ్యవహార తీరు.

ముషీరాబాద్ నియోజకవర్గం లో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయని స్థానికులు టౌన్ ప్లానింగ్ ఏసిపి దేవేందర్ కి, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య కు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకుండా ఫోన్ చేసిన ఫోన్ లేపకుండా అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై వివరణ అడిగేందుకు విలేకరులు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తి సమాధానం ఇవ్వడం లేదంటే అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఎంత స్థాయిలో పూర్తిగా సహకరిస్తున్నారో జోనల్ కమిషనర్ రవి కిరణ్ కు, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ కె తెలియాలి. ఇక డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి అయితే ఏం మాట్లాడతారో ఆయనకే తెలియాలని తిట్టడం, వోర్రడం ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం చేస్తారని ఒక బాధ్యతగల అధికారి అన్న కనీస అవగాహన లేకుండా ఆయన మాట తీరు ఉండడం చూస్తుంటే ఆయనకు లంచాలు తీసుకుని ఎలా తప్పించుకోవాలో తెలియక అలా అరవడం చేస్తారని ప్రజలు మండిపడుతున్నారు. ముషీరాబాద్ సర్కిల్ అధికారులు ప్రభుత్వ అధికారుల వాళ్లే బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదని నవాబ్ చిత్తార్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి కోట్లు కట్టించిన ఈ అధికారులపై వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేయాలని ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే నిర్మాణాలకు ముషీరాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ప్రజలు గుసగుసలు పెడుతున్నారు.

### భారీగా అవినీతి ఆరోపణలు..

ముషీరాబాద్ సర్కిల్ అధికారులపై భారీగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ రావడంతో ఎవరు ఫోన్ చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని ఒకవేళ ఫోన్ ఎత్తితే అవినీతిని ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలో తెలియక ఫోన్ ఎత్తడం లేదా.? ప్రభుత్వాన్ని నిబంధనలకు విరుద్ధంగా ముషీరాబాద్ నియోజకవర్గం లో నిర్మాణాలు చేపడుతున్నారని నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకుండా సీజ్ చేసిన బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని మరికొన్ని రోజుల తర్వాత ఆ అక్రమ నిర్మాణాలలో మరిన్ని లంచాలు తీసుకొని మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. డిప్యూటీ కమిషనర్ కు ప్రశ్నిస్తే నోటీసులు ఇచ్చామని సమాధానం చెబుతున్నారు తప్ప తిరిగి అక్రమ నిర్మాణాలు జరగకుండా ఎక్కడ అధికారులు ప్రయత్నించడం లేదని వీళ్ళ అవినీతితో అక్రమ నిర్మాణము లేని డివిజన్ లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇచ్చామని కాలక్షేపం చేస్తున్నారు తప్ప కూల్చివేతలు చేయడం లేదని గాంధీనగర్ లో పక్కింటి నెంబర్1%-1-%380/17 ఐదు అంతస్తుల అక్రమ నిర్మాణం. గాంధీనగర్ లో శ్రీ పరమేశ్వర రామాలయం గుడి వద్ద పక్కింటి నెంబర్ 1%-3-%183/40/84/1 5 అంతస్థుల భారీ అక్రమ నిర్మాణం జరుగుతుందని అక్రమాలపై ప్రశ్నిస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు వాటికి సమాధానం చెప్పడం లేదని, కళ్ళముందు నిర్మాణాలు జరుగుతున్న కార్పొరేటర్లు మౌనంగా ఉంటున్నారంటే కార్పొరేటర్లకు టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణదారులు చేతులు తడిపారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



### ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజిలెన్స్, ఏసీబీ విచారణకు ఆదేశించాలి

పరదల చాటున అక్రమ నిర్మాణాలు జరుగుతున్న సీజింగ్ బోర్డులు పెట్టిన బోర్డులు తొలగించి నిర్మాణాలు చేపడుతున్నారంటే టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులు ఇద్దరు కలిసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అలాంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, నియోజకవర్గంలో జరిగే అనేక అక్రమ నిర్మాణాలపై ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పందించి విజిలెన్స్, ఏసీబీ ఎంక్వయిరీ చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ కు సూచించాలని ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే విధంగా ఎమ్మెల్యే కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే అధికారులపై శాఖపరమైన చర్యలు చేపట్టాలని అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి వారి జేబుల్లో అక్రమ సంపాదన వేసుకొని అధికారులపై



ఏసీబీ అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించదా.?

పురపాలక శాఖ మంత్రి రేవంత్ రెడ్డి హయాంలో జిహెచ్ఎంసిలో భారీగా జరుగుతున్న అవినీతి అక్రమాలపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యమంత్రి అన్ని చూసుకోలేడు కాబట్టి



సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఏం చేస్తున్నారని దీనిపై చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి కార్యాలయం వెంటనే స్పందించి ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారికి విద్యుత్ శాఖ అధికారులు మీటర్లను ఎలా ఇస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే టౌన్ ప్లానింగ్ అధికారులు విద్యుత్ శాఖ అధికారులపై శాఖ పరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టే వారికి విద్యుత్ సౌకర్యం లేకుండా వాటర్ కనెక్షన్, డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు మున్సిపల్ అధికారులకు పదేపదే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చెప్పిన అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్న టౌన్ ప్లానింగ్ ఏసిపి సెక్షన్ అధికారిపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంత భారీగా జరుగుతున్న అవినీతిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఎలాంటి చర్యలు చేపడుతారు వేచి చూడాలి.

## మా ఆదివాసీ దేవుళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు

### - మంత్రి సీతక్క హెచ్చరిక



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క హెచ్చరించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇలాంటి వాటిని తాము సహించేది లేదని స్పష్టం చేశారు. ఇళ్ల విషయంలో బీఆర్ఎస్ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటి వరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని ఆమె అన్నారు. గ్రామాలకు పూర్తిస్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదని బీఆర్ఎస్ పార్టీని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో కొన్ని వేల ఇళ్లను ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారిందని విమర్శించారు. కొంతమంది నీచమైన రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాజకీయ రౌడీలు తయారయ్యారు... జాగ్రత్త

### - రాష్ట్రంలో రౌడీయిజం, గంజాయిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని హెచ్చరిక



అమరావతి (ప్రశ్న న్యూస్) యువతకు ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని, న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి నియామకాలు పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో, రాజకీయ ముసుగులో నేరాలు చేసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఆయన గట్టిగా సూచించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ పరేడ్ మైదానంలో కొత్తగా ఎంపికైన 5,757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. నాలుగేళ్లుగా కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న యువతకు న్యాయం చేశామన్నారు. "సంబంధిత నోటిఫికేషన్‌పై వేసిన కేసులను పరిష్కరించి, పారదర్శకంగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిది. నా హయాంలో ఇప్పటివరకు 23 వేలకు పైగా పోలీసు ఉద్యోగాలు, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశాం" అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఉదంతాన్ని గుర్తుచేసుకుంటూ చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. "రాజకీయ ముసుగులో నేరాలు చేసే రాజకీయ రౌడీలు తయారయ్యారు. వివేకా హత్య జరిగిన రోజు, ఆయన గుండెపోటుతో చనిపోయారని మొదట నేను కూడా నమ్మాను. కానీ మధ్యాహ్నానికి అది హత్య అని తెలిసింది. ఘటనా స్థలంలో రక్తపు మరకలు కడిగేశారు. ఈ విషయం స్థానిక సీఐకి తెలిసినా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు. ఆ తర్వాత 'నారాసుర రక్తచరిత్ర' అంటూ నా చేతికి కత్తిపెట్టి దుష్ప్రచారం చేశారు. ఆ కుట్రను ప్రజలు నమ్మడం వల్లే 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యాను. ఆ రోజు నేను మరింత అప్రమత్తంగా ఉండి ఉంటే ఓడిపోయేవాడిని కాదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు విధి నిర్వహణలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని చంద్రబాబు హితవు పలికారు. గతంలో ఒక పాస్టర్ ప్రమాదంలో మరణిస్తే, దాన్ని ప్రభుత్వ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని, కానీ సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిజం బయటపడిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో రౌడీయిజం, ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఎంపికైన కానిస్టేబుళ్లకు ఈ నెల 22 నుంచి తొమ్మిది నెలల పాటు శిక్షణ ప్రారంభం కానుంది.

# రామంతపూర్ డివిజన్‌లో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు

- టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన యధావిధిగా పనులు కొనసాగింపు
- ప్రభుత్వ ఆదానికి భారీగా గండి కొడుతున్న అక్రమ నిర్మాణదారులు
- నిబంధనలు బేఖాతర్ చేసిన వారిపై కేసులు నమోదుకు వెనుకాడుతున్న అధికారులు
- ప్రభుత్వ విభాగాలను బ్రష్టు పట్టిస్తున్న అవినీతి అధికారులు

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామంతపూర్ డివిజన్ శారదా నగర్ లో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ బిల్డింగును సీజ్ చేశారు. కానీ సీజ్ చేసిన బోర్డులు తొలగించి యధావిధిగా అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్న వారి పై చట్టపరమైన చర్యలు చేపట్టకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న వీరికి చట్టాలను తమ చుట్టాలుగా మలుచుకున్నారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండి కొడుతూ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పదేపదే నిర్మాణదారులకు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని తెలిపిన టౌన్ ప్లానింగ్ అధికారుల మాటలు లెక్క చేయకుండా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. మరి వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో టౌన్ ప్లానింగ్ అధికారులు కేసులు నమోదు చేయాలి కానీ చేయడం లేదు అంటే అధికారుల హస్తం ఉందా.? వాళ్లు కూడా ఈ అక్రమ నిర్మాణాల్లో భాగస్వాములు అయినారా అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని రాజకీయ నాయకులకు కావాల్సింది ముట్ట చెప్పడంతో వారు టౌన్ ప్లానింగ్ అధికారులను అటువైపు వెళ్ళవద్దని హుకుమ్ జారీ చేస్తున్నారని సీజ్ చేసిన నిర్మాణ పనులు జరుగుతున్నాయంటే దానికి అర్థం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజుకు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన పట్టించుకోవడంలేదని మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని స్థానికులు మండిపడుతున్నారు. డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ చర్యలు తీసుకుంటే దాదాపు 100% అక్రమ నిర్మాణాలు ఆగిపోతాయని కానీ డిప్యూటీ కమిషనర్ రాజు స్పందించకపోవడం



విడ్డూరంగా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టాక టౌన్ ప్లానింగ్ అధికారులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండానే విద్యుత్ శాఖ అధికారులు అక్రమ నిర్మాణదారులకు కావలసినన్ని మీటరు ఇవ్వడంతో



రామంతపూర్ డివిజన్ శారద నగర్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు సీజింగ్ చేసిన బిల్డింగ్

టౌన్ ప్లానింగ్ అధికారుల మాటలు లెక్క చేయడం లేదని జలమండలి అధికారులకు మున్సిపల్ అధికారులకు విద్యుత్ శాఖ అధికారులకు సమన్వయం లేకపోవడంతో వ్యవస్థలో ప్రతి విభాగం అవినీతిమయమైనదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టాక విద్యుత్ శాఖ



అధికారులు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టే వారికి విద్యుత్ మీటర్లు ఎలా ఇస్తారని లంచాలు ఇస్తే విద్యుత్ శాఖ అధికారులు ఏమి పట్టించుకోరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వాదానికి ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ నిర్మాణదారులపై చట్టపరమైన చర్య చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పురపాలక శాఖ మంత్రిగా ఉండడం వల్లే ఇంత అవినీతి జరుగుతోందా.? టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ముఖ్యమంత్రి మాటలకు కూడా లెక్క చేయకపోవడం చూస్తుంటే రాజకీయ నాయకుల వత్తిడి టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎలా పనిచేస్తున్నాయో అర్థమవుతుందని ప్రభుత్వానికి గండి కొట్టి చోటాభడ చెంచా లీడర్ల జేబుల్లో అక్రమ సొమ్మును వేసుకుంటున్న నాయకులపై డిప్యూటీ కమిషనర్ రాజు, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588